# ప్రజాశక్తి

గురువారం 4 ఏప్రిల్ 2024 8 పేజీలు



గుంటూరు




పల్నాడు





పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణం 26వ వార్డులోని సచివాలయం వద్ద చెట్లకింద, అరుగుల మీద లబ్ధిదార్ల నిరీక్షణ




రేపు రావాలి.. అంటూ గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణలో పెట్టిన నోటీసు



గుంటూరు జిల్లా కొల్లిపర మండల కేంద్రంలోని సచివాలయం-1 వద్ద వృద్ధుల నిరీక్షణ

# ప్రహసనంగా పింఛన్ల పంపిణీ

- ఇబ్బంది పడ్డ వృద్ధులు, మహిళలు
- రాజకీయ రాద్ధాంతంలో ఇరకాటంలో లబ్ధిదారులు
- తొలి రోజు 40 శాతం మందికి అందజేత
- అభయహస్తం, రాజధాని లబ్ధిదారులకు తప్పని జాప్యం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో తొలిరోజు సామాజిక పింఛన్ల పంపిణీ ప్రహసనంగా జరిగింది. ప్రభుత్వం బుధవారం ఉదయం 9 గంటల నుంచి పింఛన్లను అందచేస్తామని ప్రకటించడంతో ప్రతి సచివాలయం వద్దకు లబ్ధిదారులు చేరుకున్నారు. కానీ మధ్యాహ్నం వరకు ఎక్కడా పంపిణీ ప్రారంభం కాలేదు. బ్యాంకుల నుంచి సకాలంలో సచివాలయం ఉద్యోగులకు నిధులు అందకపోవటం, వచ్చిన నిధులను ఎంతమందికి ఇవ్వాలో సరైన ప్రణాళిక లేకపోవడం, తమ ఖాతాల్లో జమైన నిధులను డ్రా చేసుకోవడంలో ఎదురైన ఇబ్బందులతో సచివాలయ ఉద్యోగులు బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 9 గంటల వరకు దాదాపు 40 శాతం మందికి పింఛన్లు ఇచ్చినట్టు అధికారులు తెలిపారు. గుంటూరు జిల్లాలో 2.61 లక్షల మందికి పింఛను ఇవ్వాల్సి ఉండగా సాయంత్రం వరకు లక్ష మందికే ఇవ్వగలిగారు. మొత్తంగా పల్నాడు జిల్లాలో 44.70 శాతం మందికి, గుంటూరు జిల్లాలో 41.6 శాతం మందికి పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఇదిలా ఉండగా అభయహస్తం, రాజధాని గ్రామాల్లోని పేదలకు పింఛన్ల సొమ్ము తొలి రోజు విడుదల కాలేదు. వీరికి గురువారం నుంచి ఇస్తామని అధికారులు తెలిపారు. బాపట్ల జిల్లాలో 41 శాతం పంపిణీ చేశారు. ప్రభుత్వం నిధులు బ్యాంకులకు జమచేయడంలో జరిగిన జాప్యం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో గందరగోళం ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకుల్లో అవసరమైన మేరకు నిధులు లేకపోవడం వల్ల ఆయా బ్యాంకుల ప్రధాన కార్యాలయానికి వెళ్లి సొమ్ము తీసుకురావాల్సి వచ్చింది. దీంతో మరింత జాప్యమైంది. పట్టణ ప్రాంతాల్లో కూడా నిధులు సకాలంలో రాలేదని, తమ సచివాలయం పరిధిలో ఉన్న లబ్ధిదారుల్లో సగం మందికి కూడా నిధులు రాలేదని ఉద్యోగులు తెలిపారు. బ్యాంకుల నుంచి నిధులను డ్రా చేసుకోవడంలో ఏర్పడిన జాప్యమే తప్ప ప్రభుత్వం నుంచి ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు. కొన్నిచోట్ల నిధులు రాలేదని గురువారం పింఛన్లు ఇస్తామని సచివాలయం సిబ్బంది బోర్డులుపెట్టారు.

లబ్ధిదారుల సంఖ్య అనుగుణంగా నిధులను ఉద్యోగుల ఖాతాలో ప్రభుత్వం జమ చేయలేదు. గుంటూరులో కృష్ణనగర్ రూ.ఆరు లక్షల రావాల్సి ఉండగా రెండు లక్షలే వచ్చాయి. తూర్పు నియోజకవర్గంలో పాత గుంటూరు ఒక సచివాలయంలో బుధవారం ఉదయం ఎడ్మిన్ ఉద్యోగికి రూ.18 వేలే అతని ఖాతాలో జమయ్యాయి. 2లో



పొన్నూరులోని ఒక సచివాలయంలో లబ్ధిదారులు

### ఇబ్బందులను నివారించండి : సిపిఎం

సామాజిక పింఛన్ల పంపిణీలో లబ్ధిదారులకు ఎదురవుతున్న ఇబ్బందులను నివారించడంలో అధికారులు తగిన శ్రద్ధ వహించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. తొలిరోజు పింఛన్ల పంపిణీలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. సకాలంలో సొమ్మును ఉద్యోగులకు అందచేయకపోవడం వల్ల తీవ్ర జాప్యమైందని, తగిన సమాచారం ముందుగానే లబ్ధిదారులకు ఇవ్వాలని కోరారు. మిగతా మూడ్రోజులైనా లబ్ధిదారులకు ఇబ్బందుల్లేకుండా ఎప్పటికప్పుడు పంపిణీని పూర్తి చేయాలని, ఎండ తీవ్రత దృష్ట్యా అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు.

# మోడీ విధేయులు గెలిచి ఏం చేస్తారు?

## దేశాన్ని తిప్పలు పెడుతున్న బిజెపి, దాని వత్తాసు పార్టీలను ఓడించాలి - ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలి : వి.కృష్ణయ్య

ప్రజాశక్తి - దుగ్గిరాల, తాడేపల్లి

మోడీ కాళ్ల బేరానికి వెళ్లిన వాళ్లు గెలిచి ఏం చేస్తారని, వారిని గెలిపించి ప్రయోజనం ఏమిటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.కృష్ణయ్య అన్నారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, నల్ల చట్టాలు, ప్రజల మధ్య చీలికలు తెస్తూ దేశ ప్రజలను ముప్పతిప్పలు పెడుతున్న బిజెపికి, దానికి వత్తాసు పలుకుతున్న పార్టీలకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన దుగ్గిరాలలో సిపిఎం విస్తృత సమావేశం, తాడేపల్లిలోని పలు ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించారు. దుగ్గిరాల సమావేశానికి ఎన్.యోగేశ్వరరావు అధ్యక్షత వహించగా కృష్ణయ్య మాట్లాడుతూ గత పదేళ్లలో పార్లమెంట్లో ప్రవేశపెట్టిన 250 బిల్లులను వైసిపి, టిడిపిలు రెండూ బలపరిచాయని, వీరిద్దరూ మోడీ వద్ద పడిగాపులు కాస్తున్నారని విమర్శించారు. దేశంలో ప్రధాన సమస్యగా ఉన్న నిరుద్యోగం బిజెపి పాలనలో 65 శాతానికి పెరిగినదని తెలిపారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పిన మోడీ ఆ విషయంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. ఎలక్ట్రోరల్ బాండ్ల విషయంలో బిజెపి అవినీతి బట్టబయలైందని చెప్పారు. 2లో



దుగ్గిరాల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య

## 593 కిలోల విత్తనాలు సీజ్ 2లో

## పల్నాడు ఇన్‌ఛార్జి ఎస్పీగా రాఘవేంద్ర

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీగా ఆర్.రాఘవేంద్ర బుధవారం బాధ్యతలు చేపట్టారు. నూతన జిల్లాలు ఏర్పడిన నాటి నుండి పల్నాడు జిల్లా ఎస్పీగా వై.రవిశంకర్‌రెడ్డి పనిచేస్తూ వచ్చారు. అయితే గతనెల 17న చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలోని బొప్పూడి వద్ద జరిగిన ప్రజాగళం సభలో భద్రతా వైఫల్యాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని ఎన్నికల సంఘం బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు విధులకు హాజరు కాకూడదని నిబంధనలు విధించింది. ఎస్పీ తర్వాత స్థాయి అధికారులు బాధ్యతలు స్వీకరించాలనే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటి వరకు అదనపు ఎస్పీ (అడ్మిన్)గా వ్యవహరిస్తున్న ఆర్.రాఘవేంద్ర బుధవారం బాధ్యతలు చేపట్టారు. తదుపరి నియామక ఆదేశాలు వచ్చేంత వరకు పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీగా రాఘవేంద్ర కొనసాగనున్నారు.



## ఓటేయలేని పరిస్థితుంటే చెప్పండి

### 299 పోలింగ్ కేంద్రాల్లో 151 అత్యంత సమస్యాత్మకం

### మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని, ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవటానికి ఇబ్బంది పడే పరిస్థితులుంటే తమ దృష్టికి తేవాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్, మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్యామ్‌ప్రసాద్ కోరారు. స్థానిక ఆర్‌ఒ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 299 పోలింగ్ కేంద్రాలకుగాను 151 2లో

## రూ.2.90 లక్షల నగదు సీజ్ 2లో

## గుంటూరు అదనపు ఐజీగా అశోక్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు రేంజి ఐజిగా ఏలూరు రేంజి ఐజి జీవీజీ అశోక్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఐజి పాలరాజ్‌ను డిజిపి కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు ఇచ్చారు.



**రంజాన్ వేళలు**

ఇఫ్తార్ (గురువారం సాయంత్రం) : 6.26

సహరీ (శుక్రవారం ఉదయం) : 4.43

## రూ.2.90 లక్షల నగదు సీజ్

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుంటూరు జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి ఫ్లైయింగ్ స్క్వా డ్‌లు బుధవారం తనిఖీలు చేపట్టారు. తాడికొండ నియోజకవర్గ పరి ధిలో రూ.2.90 లక్షలు సీజ్ చేశారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీల్లో ఇప్పటి వరకూ రూ. కోటీ 87 లక్షల 67 వేల 900 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేశారు.

## పంటల సాగు విధానంపై అధ్యయనం

ప్రజాశక్తి - కొల్లిపర



[illegible] మమేకమై వ్యవసాయ సాగులో మేలు కోవాలి విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకుంటున్నామని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు అంటున్నారు బుధ వారం ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయ ఏజీబీఎస్సీ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రూరల్ అవేర్నెస్ వర్క్ ఎక్స్పీరియన్స్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని మున్నంగి గ్రామంలో పర్యటించారు ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లా డుతూ కళాశాలలో నేర్చుకున్న వ్యవసాయ విద్యకు రైతులు అనుభవాన్ని జోడించి సమగ్ర వ్యవసాయ విధానం భూసార పరిరక్షణ విత్తనాలు ఎంపిక సాగు లాభసాటి వ్యవసాయం తదితర అంశాలపై రైతులతో చర్చించి అనుభవాలను వారితో పంచు కున్నామన్నారు.



## ప్రహసంగా పింఛన్ల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

మధ్యాహ్నం రెండు గంటల వరకు జిల్లాలోని చాలా సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ ప్రారంభం కాలేదు. మరోవైపు ఐదేళ్లుగా ఇంటి వద్ద పింఛను తీసుకుంటున్న వృద్ధులు వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు మండే ఎండలో సచివాలయాలకు రావడానికి అనేక ప్రయాసల గురయ్యారు. చాలాచోట్ల ఉదయం నుంచి సాయంత్రం వరకు వృద్ధులు, వికలాంగులు, మహిళలు పడిగాపులు కాశారు. క్యూలైన్ల విధానం కూడా లేకపోవడం వల్ల గుంపులుగా గుమిగూడటం కన్పించింది.

మరోవైపు లబ్ధిదారులను ఆకట్టుకునేందుకు టిడిపి, వైసిపిలు మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లును పోటీపడి పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీలో జాప్యానికి, ఇళ్ల వద్ద పంపిణీని చంద్రబాబు నాయుడే అడ్డుకున్నారని ఆయా సచివాలయాల వద్ద వైసిపి నాయకులు, కార్యకర్తలు నానా హంగామా చేశారు. టిడిపి వారుకూడా ప్రభుత్వం నిధులు విడుదలలోనే జాప్యం చేసిందని తమ తప్పిదం ఏమి లేదని లబ్ధిదారులను ఊరడించే ప్రయత్నం చేశారు.

## ఓటేయలేని పరిస్థితుంటే చెప్పండి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాలు అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామని, ఇప్పటికే 635 మందిని బైండోవర్ చేశామని చెప్పారు. ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకునే వారిపై కఠిన చర్యలుంటాయని, ఇబ్బందులపై ఫిర్యాదు చేసేందుకు అవసరమైన నంబర్లు, యాప్‌లు గ్రామ స్థాయి అధికారి వద్ద కూడా అందుబాటులో ఉంటాయని, అవసరమైతే వారిని సంప్రదించాలని సూచించారు. యాప్‌లు ఉపయోగించుకోలేని వారు నేరుగా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రశాంత వాతావారణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు వస్తున్నాయని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పారు. లా అండ్ ఆర్డర్‌కు ఇబ్బందిలేని విధంగా రాజకీయ పార్టీలు అవసరమైన అన్ని అనుమతులు తీసుకోని ప్రచారం చేసుకోవాలన్నారు.

# గుంటూరును అగ్రగామిగా అభివృద్ధి చేస్తా : మంత్రి రజని

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజక వర్గంలో మంత్రి విడదల రజని బుధ వారం విస్తృతంగా పర్యటించారు. ఉద యాన్నే బృందావన్‌గార్డెన్స్ సెంటర్ లోని రైతు బజారుకు చేరుకున్న మంత్రి అక్కడి వ్యాపారులను ఒక్కొక్కరిగా పలుకరించు కుంటూ వెళ్లారు. అందరి పేర్లు అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వ పథకాలు ఎలా అందుతున్నాయో వారినే నేరుగా అడిగి తెలుసుకున్నారు.

రైతు బజా రులో కూర గాయలు కొనడానికి వచ్చిన పలువురు వినియోగదారులను కూడా మంత్రి పలకరించారు. ఈ సందర్భంగా రైతు బజారులోని పలు సమ స్యలను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రజిని హామీ ఇచ్చారు. అనంతరం ఎన్‌టిఆర్ స్టేడియం, అన్నమయ్య పార్కులో ప్రజలను కలిశారు. ఎన్టీఆర్ స్టేడియంలో కొద్దిసేపు షటిల్ ఆడి అక్కడివారిని ఉత్సాహపరిచారు. ఈ సం దర్భంగా మంత్రి విడదల రజిని మాట్లా డుతూ గుంటూరును రాష్ట్రంలోనే అగ్ర గామిగా నిలబట్టేలా ప్రణాళిక ప్రకారం పనిచేసుకెళుతున్నామని చెప్పారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉం డేలా మారు మూల రోడ్లను కూడా నిర్మిం చామని చెప్పారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా నగరాన్ని తీర్చి దిద్దడం తన లక్ష్యమన్నారు. గార్డెన్స్ సెంటర్‌లోని ఎన్టీఆర్ స్టేడియంకు వచ్చిన వాకర్స్‌ను,



ఎన్టీఆర్ స్టేడియంకు వచ్చిన వాకర్స్‌ను, క్రీడాకారులను పలుకరిస్తున్న మంత్రి రజని

క్రీడాకారులను పలుకరించారు. స్టేడియంకు సంబంధించి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసు కున్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి అన్నవ ుయ్య పార్కుకు వెళ్లి కొంచెంాసపు ఉదయపు నడకలో పాల్గొన్నారు. ఆ తరువాత వైద్యులతో ఆత్మీయ సమా వేశంలో పాల్గొన్నారు.

# 593 కిలోల విత్తనాలు సీజ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



నరసరావుపేటలోని విత్తన దుకాణాంలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపట్టిన అధికారులు రూ.1.74 లక్షల విలువైన 593 కిలోల విత్తనాలను సీజ్ చేశారు. బుధవారం పలు విత్తన దుకాణాలలో వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మస్తానమ్మ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ రానున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలను, అధిక ధరలను అరి కట్టేందుకు ప్రత్యేకంగా తనికీలు చేస్తున్నామన్నారు. విత్తన అమ్మకపు అనుమతి పత్రాలు లేని కొన్ని కంపెనీల విత్తన అమ్మకాలను నిలిపేశామన్నారు. నిషేధిత గ్లైసిల్, బిటి పత్తి విత్తనాలు అమ్మితే దుకాణం లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, దుకాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. తనిఖీలలో మండల వ్యవసాయ శాఖాధికారి వి.నరేంద్రబాబు, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

## రోబోటిక్స్ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

రోబోటిక్స్ రంగానికి ప్రాధాన్యం పెరిగిన తరుణంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రోబోటిక్స్ క్లబ్‌ను ప్రారంభించనున్నట్లు వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ తెలిపారు. వర్సిటీలోని డాక్టర్ వైఎస్ఆర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై రెండ్రోజుల వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ రోబోటిక్స్ రంగంలో అపార ఉపాధి అవకాశాలున్నాయని చెప్పారు. వర్సిటీలో నూతన కోర్సుల్లో భాగంగా రోబోటిక్స్ కోర్సునూ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కంప్యూటర్ పాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ నారంగ్ వివిధ రకాల రోబోట్లను ప్రదర్శించి వాటి నిర్మాణ పనులను, ప్రాధాన్యతను వివరించారు. పరిశ్రమల్లో ఉపయోగించే రోబోట్‌లపై మరొక అతిథి సుదర్శన్ జయబాలని అవగాహన కల్పించారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ తదితర అంశాల్లో వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇంజినీరింగ్ కోర్సుల డీన్ ప్రొఫెసర్ ఇ.శ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిద్ధయ్య, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గంగాధరరావు, విభాగాధిపతి బాలాజీ, అధ్యాపకులు సతీష్ కుమార్, చైతన్య పాల్గొన్నారు.

## మోడీ విధేయులు గెలిచి ఏం చేస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ రంగాన్ని బిజెపి నాశనం చేసిందని, దేశాన్ని దివాళా తీయిస్తున్న బిజెపి ఓటమికి అందరూ కలిసి రావాలన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన సిఎఎను రద్దు చేయాలని, దీనిపై 14న మంగళగిరిలో చర్చ ఉంటుందని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ బిజెపిని ఓడించకపోతే దేశానికి రక్షణ లేదన్నారు. మతం పేరుతో ప్రజల మధ్య చీలికలు తెస్తోందని, రాజ్యాంగంలోని లౌకిక విధానానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. రాజకీయాల్లో మతాలను జొప్పించకూడదనే విషయాన్ని విస్మరించిన ప్రధాని మోడీ ఆయనే స్వయంగా దేవాలయాలను ప్రారంభించడం ఏమిటని నిలదీశారు. వివాదాస్పద ప్రాంతంలో మసీదును కూల్చి దేవాలయం నిర్మించారని, రిజర్వేషన్లకు ఎసరు పెట్టేందుకు పూనుకున్నారని చెప్పారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారని, దర్యాప్తు సంస్థల ద్వారా రాజకీయ కక్షలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం నిత్యం పోరాడుతోందన్నారు. మంగళగిరి నియోజకవర్గలో ప్రధాన సమస్యలపై పోరాడిందన్నారు. 70 శాతం కౌలు రైతులున్న ఈ ప్రాంతంలో కౌలు గుర్తింపు కార్డులు, పంట రుణాలు, హై లెవెల్ ఛానల్, గుంటూరు ఛానల్ కోసం ప్రజా సంఘాలతోపాటు సిపిఎం ఉద్యమించిందని గుర్తు చేశారు. నియోజకవర్గంలో 40 వేల కుటుంబాలు ఆక్రమణ ప్రాంతాల్లో ఇళ్లేసుకుని ఉన్నారని, వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న 15 వేల మందికి పట్టాలు ఇప్పించామని తెలిపారు. లోకేష్ మంత్రిగా ఉన్నప్పుడు పట్టాలివ్వకుండా ఇప్పుడు మాత్రం వాగ్దానాలు చేస్తున్నారని ఎద్దేవ చేశారు. వైసిపి, టిడిపికి ఓటేస్తే బిజెపికి ఓటేసినట్లేనని ప్రజలు గుర్తించాలన్నారు. కాంగ్రెస్, వామపక్షాల మద్దతుతో ఇండియా బ్లాక్ తరుపున పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జొన్న శివశంకర్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, ఎన్.భావన్నారాయణ, నాయకులు బి.శ్రీనివాసరావు, మండల కార్యదర్శి జె.బాలరాజు, నాయకులు బి.శ్రీనివాసరావు, ఎం.శివసామిరెడ్డి, షేక్ హుస్సేన్, కె.బాబూప్రసాద్, వై.బ్రహ్మేశ్వరరావు, సిహెచ్ పోతురాజు, జి.యోహాను, బి.అమ్మిరెడ్డి పాల్గొన్నారు.



తాడేపల్లిలోని ఉండవల్లి ప్రాంతంలో టెలిఫోన్ కాలనీ, ఎస్టీ కాలనీల్లో సమావేశాలు నిర్వహించగా జొన్న శివశంకరరావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత సిపిఎం మాజీ ఎమ్మెల్యే నిమ్మగడ్డ రామమోహన్‌రావుకు దక్కుతుందన్నారు. గతంలో మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి, ఉండవల్లి, పెనుమాక, కొలనుకొండ, కుంచనపల్లి, వడ్డేశ్వరం, ప్రాతూరు, కాజా, చినకాకాని, నూతక్కి గ్రామాల్లో సర్పంచులుగా సిపిఎం నేతలు ఎన్నికై గ్రామాల అభివృద్ధికి మారుపేరుగా నిలిచారని చెప్పారు. ప్రజా సమస్యలపై సిపిఎం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో 20 వేల మంది పేదలతో వివిధ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు, ఇల్లు వేయించి, ఆ ఇళ్లను నిలబెట్టిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై ధరల భారాలు వేసినప్పుడల్లా ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా సిపిఎం ఆందోళనలు నిర్వహించిందన్నారు. కరోనా కష్టకాలంలో సిపిఎం కార్యాలయాలన్నీ కరోనా బాధితుల కోసం క్వారంటైన్ కేంద్రంగా చేసి సిపిఎం కార్యకర్తలు ప్రాణాలకు తెగించి వాలంటీర్లుగా పని చేశారని గుర్తు చేశారు. కరోనా పేషెంట్లు ఉన్న ఇంటింటికి వెళ్లి ఆహారం అందజేశారని చెప్పారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ అభివృద్ధికి మారుపేరుగా నిలిచే సిపిఎం అభ్యర్థిని మంగళగిరి నియోజకవర్గం నుండి అసెంబ్లీకి పంపించడం ద్వారానే మంగళగిరి నియోజకవర్గంలో ఉన్న పేరుకుపోయిన సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై నిస్వార్ధంగా పనిచేస్తున్న కమ్యూనిస్టుల గెలుపు అభివృద్ధికి మలుపని అన్నారు. సమావేశాల్లో నాయకులు యు.వెంకటేశ్వరరావు, కె.జగదీశ్వర్‌రెడ్డి, ఎస్.వెంకటనారాయణ, ఎస్కే ఎర్రపీరు, ఇమ్మానియేల్, రాజు, శ్రీనివాసరెడ్డి, టి.బక్కిరెడ్డి, కె.రామకృష్ణ, పార్థసారథి, బోస్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళి పాటిస్తూ ప్రచారం నిర్వహించుకోవాలి

## కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

**ప్రజాశక్తి-గుంటూరు**

జిల్లాలో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటిస్తూ ప్రచారాలు నిర్వహించుకోవాలని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రార్ధనా మందిరాలలో ప్రచారాలు నిర్వహించవద్దని, పార్టీ కండువాలతో వెళ్ళవద్దని సూచించారు. మైక్ పర్మిషన్ తీసుకున్న ప్రాంతాల్లో కాకుండా వేరే ప్రాంతాల్లో మైక్ అనౌన్స్‌మెంట్ చేయకూడదని, రాత్రి పదిగంటల తర్వాత ప్రచారాలు ఆపి వేయాలన్నారు. రాజకీయ పార్టీలు వారి ప్రచార సామాగ్రి తరలించేటప్పుడు తనిఖీలకు సహకరించాలని, అనుమతి పత్రాలను వాహనాల ముందు తగిలించుకోవాలన్నారు. సీజ్ చేసిన నగదుకు సంబంధించి సరైన ఆధారాలు చూపితే సంబంధిత యజమానులకు అందజేయటం జరుగుతుందన్నారు. కరపత్రాలకు, పోస్టర్లకు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ అనుమతి అవసరం లేదని, ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా, కుల, మతాల ప్రస్తావన లేకుండా ఆడియో, వీడియోల ద్వారా నిర్వహించే ప్రచారాలకు యంసీయంసీ నుండి ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. సీవిజిల్‌లో నమోదైన కేసులలో 95 శాతం కేసులను నిర్దేశిత సమయంలోనే తనిఖీ బృందాలు పరిష్కరించడం జరిగిందన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ క్రింద 65 వేలకు పైగా వాల్‌పోస్టర్లు, బ్యానర్లు తొలగించడం జరిగిందన్నారు. జిల్లాలో లైసెన్స్ కల్గిన 323 తుపాకులకు గాను 74 వాటికి మినహాయింపు ఇవ్వడం జరిగిందని, మిగిలిన వాటిని పోలీసు శాఖాధి కారులకు అప్పగించడం జరిగిందన్నారు. జేసీ జి.రాజకుమారి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలుల్లోకి రాకముందు రాజకీయ పార్టీలు చాలా కరపత్రాలు ముద్రించడం జరిగిందని, వాటిలో ప్రింటర్‌పేరు, ఎన్ని కరపత్రాలు ముద్రించేది తదితర విషయాలు పొందు పరచలేదని, ఇప్పటి నుండి ముద్రించే కరపత్రాలలో అన్ని విషయాలు పొందు పరచాలన్నారు. తాత్కాలిక పార్టీ కార్యాలయాలు పోలింగ్ కేంద్రాల దగ్గరలో ఏర్పాటు చేస్తున్నారని, పోలింగ్ కేంద్రాలకు 25 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. లౌడ్ స్పీకర్లు, డీజే సిస్టమ్స్‌పై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారని , పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారి సూచనల మేరకు పగలు 55 డెసిబుల్స్, రాత్రి పూట 45 డెసిబుల్స్ సౌండ్ వుండాలన్నారు. విద్యార్థులకు పరీక్షల సమయం అయినందున విద్యా సంస్థలవద్ద, ఆసుపత్రుల వద్ద సౌండ్ తగ్గించుకొని ప్రచారాలు నిర్వహించుకోవాలని సూచించారు. సమావేశంలో నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, డిఆర్‌ఒ పెద్ది రోజా, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

## అంగలూరులో వీధికుక్కల దాడులు

**ప్రజాశక్తి-ఈపూరు**



కుక్కల దాడిలో మృతి చెందిన ఆవుదూడ (ఫైల్)

వీధి కుక్కల దాడులతో మండలం లోని అంగులూరు గ్రామస్తులు భయాం దోళన చెందుతున్నారు. గ్రామంలో వీధి కుక్కలు.. గొర్రెలు, మేకలు, కోళ్ల, పశువులపై తరచూ దాడి చేసి చంపేస్తున్నాయి. వారం రోజుల క్రితం మునుగోటి శ్రీనివాసరావు కు చెందిన ఆవు దూడను పుట్టిన మరుసటి రోజే వీధి కుక్కలు దాడి చేసి చంపేశాయి. దొడ్డా నాగయ్య, సన్నే బోయిన శ్రీనివాసరావు కు చెందిన గొర్రెలు, మేకలు కుక్కల దాడిలో మృత్యువాత పడ్డాయి. కట్టా వాసు, కట్టా అంకా రావు, హర్షవర్ధన్ రావు లకు చెందిన కోళ్లను చంపి తినే శాయని వేల రూపాయలు నష్టం వాటిల్లినట్లు బాధి తులు తెలిపారు. గ్రామంలో వీధి కుక్కల స్వైర విహారం అధి కంగా ఉందని బజారుకు వెళ్లా లంటే ఎక్కడ దాడి చేస్తా యోనని భయపడుతూ ఉం డాల్సిన పరిస్థితులు ఉన్నా యన్నారు. పంచాయతి అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని చెబుతున్నారు. వీధి కుక్కలను గ్రామం నుండి తరలించేలా పంచాయతి అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## హత్య కేసును ఛేధించిన పోలీసులు

**ప్రజాశక్తి-చిలకలూరిపేట**



రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ వర్మ

మండల పరిధిలోని మురికిపూడిలో ఎద్దు ఏసుబాబు హత్య కేసును పోలీసులు ఛేదిం చారు. ఈ హత్య కేసుకు సం బంధించిన వివరాలను బుధ వారం స్థానిక రూరల్ పోలీస్టేషన్‌లో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో డిఎస్పి వర్మ చెప్పారు. తన అక్రమ సంబంధానికి అడ్డు వస్తు న్నాడని భావించిన ఏసుబాబు భార్య రజని, ప్రియుడు మురళీకృష్ణలు మరి కొంత మందితో కలిసి గత నెల 28న ఏసుబాబును హత్య చేశారని చెప్పారు. పొగాకు చేలో పార్టీ చేసుకుందామని చెప్పి ఏసుబాబును సూరబోయిన మురళీకృష్ణ పిలిచాడని చెప్పారు.మద్యం తాగిన తర్వాత ఏసుబాబు మెడపై కొట్టి హత్య చేశాడని, ఈ ఘటనను ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని చెప్పారు. ఈ కేసులో సూరబోయిన మురళీకృష్ణ, ఒంటరి ఏసు బాబు, సూరబోయిన రామ కోటేశ్వరరావు, ఎద్దు రజిని అనే నలుగురిని మంగళవారం అరెస్టు చేసి బుధవారం కోర్టులో ప్రవేశపెట్టినట్లు తెలి పారు. సమావేశంలో గ్రామీణ సిఐ శ్రీనివాసరెడ్డి, ఎస్సై రవి కృష్ణ, బాలకృష్ణ పాల్గొన్నారు.

## దొంగతనాల కేసుల్లో నిందితుని అరెస్టు

**ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి**

గుంటూరు పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలతోపాటు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇళ్లలో దొంగతనాలకుపాల్పడుతున్న నిందితుడ్ని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. పట్టాభిపురం ఎస్ఐ విజయచంద్ర కథనం ప్రకారం గుంటూరు గుజ్జనగుండ్లకు చెందిన కోసూరి శ్రీనివాసరావు మంగళగిరి, గుంటూరు, పొన్నూరు తదితర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడిన ఘటనల్లో అరెస్టు చేసి అతని వద్దనుంచి ఒక మోటార్ సైకిల్, సుమారు 39 గ్రాముల బంగారు ఆభరణాలు, సుమారు 353 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని కోర్టు లో హాజరు పర్చగా రిమాండ్‌కు పంపారు. ఇతను తోటి నేరస్తులతో కలసి రాత్రి పూట ఇళ్ళ వద్దకు వెళ్లి బయట కాపలాగా ఉంటాడు. రెండో వ్యక్తి ఇంటి లోనికి వెళ్లి దొంగిలిస్తాడని ఎస్ఐ విజయచంద్ర తెలిపారు.

## పగలే వెలుగులు



**ప్రజాశక్తి-తాడేపల్లి :** పట్టపగలే తాడేపల్లి పట్టణంలోని సంజీవయ్యనగర్ ప్రాంతంలో విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. నేటికీ కొండ ప్రాంతాల్లో కొన్నిచోట్ల విద్యుత్ దీపాలు వెలగర అంధకారం నెలకొంది. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పాములు, తేళ్లు వంటి వాటి మధ్య గడపాల్సి వస్తుందని వాపోతున్నారు. విద్యుత్ సౌకర్యం లేక కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పట్టపగలే విద్యుత్ దీపాలు వెలిగించి ప్రజా ధనం దుర్వినియోగం పరచడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# టెయిల్ పాండ్ ప్రాజెక్టులో పడిపోయిన విద్యుత్ ఉత్పత్తి

**ప్రజాశక్తి - రెంటచింతల**



రెంటచింతల మండలంలోని సత్రశాల వద్ద కష్ణా నదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. వర్షా బావ పరిస్థితులు నెలకొనడం వలన సరైన వర్షాలు లేక విద్యుత్ ఉత్పత్తి టార్గెట్ ను కూడా చేరుకోలేకపోయారు. ఈ ప్రాజెక్టు 50 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యంతో 2006లో 464 కోట్ల రూపాయలతో ప్రారంభమై 2017లో 1050 కోట్ల రూపా యలతో పూర్త యింది. విద్యుత్ ఉత్పత్తికి రెండు టర్బైన్లు ఏర్పాటు చేశారు. 2017 జనవరి 9న విద్యుత్ ఉత్పత్తిని ఆరంభించారు. అప్పటినుండి రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి అయింది. ఈ సంవత్సరం మార్చి 31 నాటికి కేవలం 0.7284 ఎంయుల (మెగా వాట్ల ) విద్యుత్తు మాత్రమే తయారైంది 2021 -22 సంవత్సరంలో 137.67 ఎంయులు 2022-23 సంవత్సరంలో 98.1246 ఎంయుల విద్యుత్ ఉత్పత్తి తయారైంది. ప్రాజెక్టు ఆరంభం నుంచి ఇప్పటివరకు 473.47 మెగావాట్ల విద్యుత్తు తయారైంది. ప్రస్తుతం రిజర్వాయర్లో ఏడు టిఎంసిల నీరు ఉంది.





## మిర్చి నిల్వలు

| | బ్యాగులు |
|---|---|
| మిర్చి దిగుమతి | : 1,11,752 |
| మిర్చి ఎగుమతి | : 1,09,377 |
| మిర్చి నిల్వ | : 85,603 |

## మిర్చి ధరలు

| | రూపాయలలో |
|---|---|
| 334 | 8,000 - 19,000 |
| నెం.5 | 9,000 - 17,000 |
| 273 | 10,000 - 14,500 |
| 341 | 9,000 - 17,000 |
| 4884 | 9,000 - 14,000 |
| సూపర్ 10 | 12,000 -12,500 |
| | నాన్ ఏసి |
| తేజ | 8,000 - 20,000 |
| బడిగె | 8,000 -16,000 |
| దేవనూరు డీలక్స్ | 9,000 -18,000 |
| తాలుకాయలు | 5,000 - 11,500 |

## కుట్రలు మాని ఇళ్ల వద్దే పింఛన్ల పంపిణీ చేయాలి : జీవి ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

వైసిపి రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న కుట్రలు మానుకుని లబ్ధిదార్ల ఇళ్ల వద్దకే పింఛన్లు పంపిణీ చేయాలని వినుకొండ అసెంబ్లీ టిడిపి అభ్యర్థి జీవి ఆంజనేయులు డిమాండ్ చేశారు. కావాల్సినంతమంది సచివాలయ సిబ్బంది ఉండి, ఇంటిటికీ వెళ్లి పంపిణీ చేసే అవకాశమున్నా జగన్‌రెడ్డి ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగానే వృద్ధులు, వికలాంగుల్ని ఇబ్బంది పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై వినుకొండలో బుధవారం జరిగిన ముస్లిమ్ మైనార్టీ, నూర్‌బాషాల ఆత్మీయ సమావేశం వేదిక నుంచే కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీకి తక్షణమే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో 3, 4 గ్రామాలకు కలిపి ఒకచోటే సచివాలయం ఏర్పాటు చేశారని, అలాంటి ప్రాంతాల్లో పింఛన్లు తీసుకోవడానికి లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్‌కు చెప్పారు. ఏ గ్రామానికి ఆ గ్రామంలోనే పింఛన్లు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.



## టిడిపి, జనసేన కపట ప్రేమ : వైసిపి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సామాజిక పింఛను విషయంలో లబ్ధిదార్లపై టిడిపి, జనసేన నాయకులు కపట ప్రేమ చూపుతున్నారని వైసిపి చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు విమర్శించారు. పట్టణంలోని 35వ వార్డులో ఎన్నికల ప్రచారంలో బుధవారం పాల్గొన్న ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు. సుగాలీకాలనీ, సాంబశివ నగర్‌లోని పలు వీధుల్లో ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటో తేదీన ఠంచనుగా పింఛనును వాలంటీర్ల ద్వారా అందిస్తుంటే ప్రతిపక్ష నాయకులే ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించి నిలిపేయించారని విమర్శించారు. పథకాలు కొనసాగాలంటే వైసిపిని మళ్లీ గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కౌన్సిలర్లు కె.రమణీబాయి, కోట్యానాయక్, నాయకులు అల్లీమియా, తలహాఖాన్, సుభాని, బి.చిన్న, రంగానాయక్, శ్రీనునాయక్, పీక్లానాయక్, సాంప్లానాయక్, నాగూల్‌నాయక్ పాల్గొన్నారు.

## మార్గదర్శకాలకు విరుద్ధంగా పింఛన్ల పంపిణీ : టిడిపి

ప్రజాశక్తి-ఈపూరు

ఎలక్షన్ కమిషన్ ఆదేశాలకు విరుద్ధంగా సచివాలయాల్లో పింఛను పంపిణీ చేపడుతున్నారని, లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛను అందించాలని టిడిపి నాయకులు కోరారు. ఈ మేరకు ఎంపిడిఒ రంగనాయకులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్ నగదు అందజేయాల్సి ఉండగా లబ్ధిదారులను సచివాలయాల వద్దకు పిలిపించుకొని పింఛను ఇస్తున్నారని చెప్పారు. దీనివల్ల సచివాలయ పరిధిలోని గ్రామాల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సచివాలయ సిబ్బంది వైసిపి అడుగు జాడల్లో నడుస్తూ పింఛను లబ్ధిదార్లను ఆకట్టుకునే ఉద్దేశంతో ఇలా చేస్తున్నారని, ఈ తీరు వల్ల వృద్ధులు, వికలాంగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు టి.బాలయ్య, బి.సైదులు, సిహెచ్.మల్లయ్య, రామారావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

# చెప్పలేదు.. చెయ్యలేదు..



చిలకలూరిపేటలోని ఓ సచివాలయం వద్ద లబ్ధిదార్లు

- పింఛను ఎప్పుడు పంపిణీ చేస్తారో సమాచారం ఇవ్వని అధికారులు
- సచివాలయాల వద్ద తాగునీరు, కుర్చీల ఏర్పాట్లపైనా నిర్లక్ష్యం
- చిలకలూరిపేటలో గంటల తరబడి నిరీక్షణ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సమాచారం తెలపడంలో, వసతుల కల్పనలో నిర్లక్ష్యం కారణంగా వృద్ధులైన పింఛనుదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పింఛనెప్పుడిస్తారా? అని రోజంతా చెట్లకింద, అరుగులపైన పడిగాపులు కాశారు. ఎన్నికల నేపథ్యంలో సచివాలయాల ద్వారానే నేరుగా పింఛన్ల పంపిణీ చేపట్టిన క్రమంలో బుధవారం ఉదయం నుంచే పంపిణీ చేస్తారని భావించిన లబ్ధిదారులు సచివాలయాల వద్దకు 11 గంటలకే చేరుకున్నారు. మరోవైపు డబ్బుల కోసం బ్యాంకుల వద్దకెళ్లిన సచివాలయ అడ్మిన్లు నగదు కోసం సాయంత్రం వరకూ నిరీక్షించారు. 4.30 గంటల తర్వాత నగదు ఇవ్వడంతో 5 గంటల తర్వాత లబ్ధిదార్లకు పంపిణీని ప్రారంభించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు టెంటు, తాగునీటి సదుపాయం, కుర్చీలు ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదార్లు నానా అగచాట్లు పడ్డారు. ఇదిలా ఉండగా పట్టణంలోని 27 వార్డుకు సంబంధించిన 23వ సచివాలయం పరిధిలో 485 మందికి రూ.14 లక్షల 70 వేలు పింఛను ఇవ్వాల్సి ఉండగా బుధవారం రూ.6 లక్షలే ఇచ్చారని 98 మందికి పంపిణీ చేశారు. మళ్లీ బ్యాంకు నుండి డబ్బు తెచ్చి మిగతావారికి ఇస్తామని సచివాలయ అడ్మిన్ తెలిపారు. 26 వార్డులో 342 మందికి రూ.10 లక్షల 20 వేలు ఇవ్వాల్సి ఉండగా రూ.6 లక్షలే వచ్చినట్లు తెలిపారు. ఈ వార్డులో 57 మందికి పంపిణీ చేశారు. మొత్తంగా పట్టణంలో 23 శాతం మందికి పింఛనును పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

దీనిపై పట్టణ కమిషనర్ సిహెచ్ గోవిందరాబు స్పందిస్తూ పట్టణ పరిధిలోని 29 సచివాలయల పరిధిలో 11,334 మందికి రూ.3 కోట్ల, 42 లక్షల 39 వేల 500 మొత్తం ఇవ్వాల్సి ఉందని, ఒకపూట ఆలస్యమైనా అందరికీ పింఛను అందిస్తామని, ఇళ్లకు వచ్చి ఇచ్చేలా చూస్తామని చెప్పారు. సచివాలయ సిబ్బంది ఉదయం 6 గంటల నుంచి 10 గంటల్లో.. సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకూ పింఛను అందిస్తారని చెప్పారు. ఎవ్వరూ కంగారు పడొద్దని, సచివాలయాల్లో పింఛను తీసుకునేవారి కోసం ఒక ఉద్యోగిని ఏర్పాటు చేస్తామని అన్నారు.



ముప్పాళ్ల మండలంలో పింఛను పంపిణీలో అధికారులు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని పలు సచివాలయాల వద్ద సామాజిక పింఛను కోసం లబ్ధిదారులు బుధవారం ఉదయం నుంచే బారులు తీరారు. మధ్యాహ్నానికి సచివాలయాల సిబ్బందికి డబ్బులు అందడంతో వెంటనే పంపిణీ చేపట్టారు. మధ్యలో సుమారు అరగంట పాటు సర్వర్ మొరాయించింది. మధ్యాహ్నం వరకూ 5 సచివాలయ పరిధిలోని గ్రామాల వరకే బ్యాంకులో డబ్బులిచ్చారు. మిగిలిన సచివాలయాలకు సాయంత్రం 4 గంటల సమయంలో అందజేశారు. ముందుగా ఇచ్చిన సచివాలయాలలో పంపిణీ 80 శాతం పూర్తవ్వగా ఆలస్యంగా బ్యాంకు నుంచి నగదు తెచ్చుకున్న సచివాలయాలలో 30-40 శాతం వరకే పంపిణీ చేశారు. పంపిణీ నేపథ్యంలో సచివాలయాల వద్ద టెంట్, తాగునీరు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

# హద్దులు దాటి తిట్ల దండకం.. ఆర్వో నోటీసు..

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ నియోజకవర్గంలోని రాజకీయ పార్టీ నాయకుల మధ్య పరస్పర విమర్శలు శృతి మించుతున్నాయి. తాము అధికారంలోకి వస్తే ఏమి చేస్తామో ప్రజలకు చెప్పాల్సిన నాయకులు అందుకు బదులు బూతులందుకుంటున్నారు. ఒకరిపై ఒకరు దూషణలకు పాల్పడుతూ ప్రజల చిత్కారాలకు గురవుతున్నారు. ఇటీవల విలేకరుల సమావేశంలో బూతు పదజాలంతో రెచ్చిపోయిన వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడుపై ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో బ్రహ్మనాయుడుకు రిటర్నింగ్ అధికారి నోటీసు అందజేశారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో ఇచ్చిన ఈ నోటీసుకు బ్రహ్మనాయుడు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. మరోవైపు సామాజిక మాధ్యమాల్లోనూ పరుష పదజాలంతోనే ఒకర్నొకరు తిట్టుకుంటూ అధిపత్యం కోసం యత్నిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పోస్టులు ఉంటున్నాయి. హుందాగా వ్యవహరించాల్సిన ప్రజాప్రతినిధులు, నాయకులు తమ స్థాయిని మరిచి బూతులు లంఘించుకోవడం, వాటిని సామాజిక తరగతులకు ఆపాదించడం, ఆయా తరగతులకు చెందిన నాయకులతో విమర్శలు, ప్రతి విమర్శలు చేయించడం సామాన్యుల ఛీత్కారాలకు గురవుతోంది. దూర్భాషలు మానుకుని ప్రజా సమస్యలపై మాట్లాడుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

## పోలింగ్ సిబ్బందికి నేడు తొలివిడత అవగాహన

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :** రానున్న సార్వత్రిక ఎన్నికలలో పాల్గొంటున్న పోలింగ్ సిబ్బంది తొలి విడత రాండమైజేషన్ ప్రక్రియ నేడు చేపట్టనున్నట్లు పల్నాడు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ చెప్పారు. పోలింగ్ సిబ్బంది నియామకాలపై నోడల్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట తన క్యాంపు కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. అర్హులైన వారికి పీవోలుగా నియమించేలా చూడాలన్నారు. అవకతవకలు జరగకుండా జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారు, చనిపోయిన వారి వివరాలను తొలగించి పగడ్బందీగా జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ సిబ్బంది నియమించాలన్నారు. ఎంతమందిని నియమించారు? సిబ్బంది కొరత ఏమైనా ఉందా? అనే వివరాలు అడిగారు.



## మేమంతా సిద్ధం సభ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :** రానున్న ఎన్నికల్లో వైసిపి విజయం తథ్యమని, గత ఎన్నికల మాదిరి పల్నాడు జిల్లాలో పార్లమెంట్ స్థానంతో 7 అసెంబ్లీ స్థానాల్లో వైసిపి జెండా ఎగురవేయడం ఖాయమని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని వైసిపి పార్లమెంట్ కార్యాలయంలో 'మేమంతా సిద్ధం' సభ పోస్టర్‌ను ఎంపి అభ్యర్థి అనీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, చిలకలూరిపేట వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు తదితరులతో కలిసి ఆయోధ్యరామిరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో వినుకొండ నుంచి మేమంతా సిద్ధం యాత్ర ప్రారంభం అవుతుందని, సభ పిడుగురాళ్లలో జరుగుతుందని చెప్పారు. అనిల్ కుమార్ యాదవ్, కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి పాలనలో పల్నాడు గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందిందన్నారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ వైసిపికి మరోసారి పట్టం కట్టాలని కోరారు.

# ఓటర్లను చైతన్య పర్చేందుకు సెల్ఫీ పాయింట్

ప్రజాశక్తి - మాచర్ల

ఓటర్లను చైతన్యపర్చే కార్యక్రమంలో భాగంగా సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేసినట్లు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్, మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. స్వీప్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఒ కార్యాలయంలో సెల్ఫీ పాయింట్‌ను జెసి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు కోసం నమోదు చేసుకోవాలని, ఓటర్లయితే దాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఓటరు సెల్ఫీ దిగి రానున్న జనరల్ ఎలక్షన్స్‌లో నేను ఓటు వేయబోతున్నాను అని ప్రతిజ్ఞ చేయాలన్నారు. ఇదిలా




ఉండగా ఓటర్లను చైతన్యం చేసేందుకు రూపొందించిన ప్రత్యేక రథంతో పలువార్డుల్లో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో తహశీల్దార్ మంజునాథ్‌రెడ్డి, ఎలక్షన్ డిటి జానిబాషా, ఆర్ఐ శ్రీనివాసరావు, విఆర్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఇబ్బందుల్లేకుండా పింఛన్ల పంపిణీ

లబ్ధిదార్లకు ఇబ్బంది రాకుండా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్, మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం స్థానిక తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 48,943 మంది లబ్ధిదార్లున్నారని, వీరికి పంపిణీ చేసే పింఛను నగదును మున్సిపల్ కమిషనర్, ఎంపిడిఒలు విత్‌డ్రా చేశారని చెప్పారు. ఈ మొత్తాన్ని సచివాలయాల కార్యదర్శుల వద్దకు చేర్చి పింఛనుదారులకు అందిస్తామన్నారు. సచివాలయంతో పాటు సచివాలయం పరిధిలోని హెబిటేషన్స్ వద్దకు కూడ సిబ్బంది వచ్చి పెన్షన్లు సులువుగా పంపిణి చేస్తారని అన్నారు. ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు పింఛను పంపిణీ ఉంటుందన్నారు. మంచానికే పరిమితమైన వారికి సిబ్బంది ఇంటికి వెళ్లి ఇస్తారన్నారు. 81 సచివాలయాల పరిధిలో 630 మంది సిబ్బంది పంపిణి చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వ ఆదేశాల మేరకు 6వ తేదిలోపు పంపిణీని పూర్తి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ డి.వెంకటదాసు, తహశీల్దార్ మంజునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

# డ్రెయిన్‌లోకి సీసీఎల్ వ్యర్థాల మళ్లింపు

- పంటపొలాలు దెబ్బతింటున్నాయంటున్న రైతులు
- తాగునీరు కలుషితమని ప్రజల ఆవేదన - పట్టించుకోని అధికార యంత్రాగం

**పంటభూములు పాడై పోతున్నాయి. నిస్సారంగా మారుతున్నాయి. ఓ వైపు భూగర్భ జలాలు కలుషిత మౌతున్నాయి. చివరకు తాగునీరు కూడా గరళంగా మారుతోంది. విషతుల్యమైన తాగునీటితో ప్రజలు ప్రాణాలు కోల్పోవటం, తీవ్ర అనారోగ్యానికి గురౌతున్నా పట్టించుకునే నాధుడేలేదు. ఇంత జరుగుతన్నా అధికారుల్లో మాత్రం చలనం లేదు. ప్రజల ప్రాణాలతో ఫ్యాక్టరీ యాజమాన్యం చెలగాటమాడుతున్నా నియంత్రించే అధికారులే కరువయ్యారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల కాంటినెంటల్ కాఫీవర్క్స్ వ్యర్థాలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలిలా ఉన్నాయి.**



డ్రెయిన్‌లో నిలిచిపోయిన కాఫీ ఫ్యాక్టరీ వ్యర్థపు నీరు

ప్రజాశక్తి-తెనాలి

కాంటినెంటర్ కాపీ వర్క్స్ ఓ అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటైన వ్యాపార సంస్థ. ఇతర దేశాలకు ఈ ప్రాంతం నుంచి కాఫీపొడి ఎగుమతి చేస్తారు. ఫ్యాక్టరీ ఏర్పాటు సమయంలో ప్రజలకు గాని, పంటలకు గాని ఎలాంటి ఇబ్బంది ఉండదని, పైగా ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పిన మాటలు. ఇప్పుడు ఆ ఊసే లేదు. పంటలు పాడైపోయినా, రైతులు ఆందోళనలు చేసినా, తాగునీరు కలుషితమైనా ఫ్యాక్టరీ యాజమాన్యంలో ఏమాత్రం చలనం లేదు. ఇక అధికారుల సంగతి సరేసరి. ప్రారంభంలో ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థపు నీటిని సమీపంలోని పొలాల్లోకి అర్ధరాత్రి సమయాల్లో వదిలేవారు. కాలక్రమంలో రైతులు గుర్తించి, ఆందోళన చేయటంతో ఆ నీటిని ఓ పైప్‌లైన్ ద్వారా కొమ్మమూరు కెనాల్ కిందిగా ఈమని వైపున్న పంటపొలాల్లోకి మళ్ళించారు. దానిని కూడా రైతులు తీవ్రంగా ప్రతిఘటించారు. పొలాలు పాడై పోతున్నాయని, భూమి నిస్సారంగా మారుతోందని దశల వారీగా ఆందోళన చేయటంతో అ ప్రక్రియకు చరమగీతం పాడారు. తదుపరి దుగ్గిరాల, మోరంపూడి, కొలకలూరు, గుడివాడ మీదుగా ప్రవహించే డ్రెయినేజ్ కాలువకట్టను ఆసరా చేసుకుని, ఆకట్టలో కొలకలూరు శివారు వరకు పైప్‌లైన్ బిగించి, దాని ద్వారా డ్రెయిన్‌లోకి ఫ్యాక్టరీ వ్యర్థాలను మళ్ళిస్తున్నారు. దీనిపై కూడా కొలకలూరు గ్రామానికి చెందిన రైతులు పలు దఫాలుగా ఆందోళన చేసినా అధికారులు మాత్రం పట్టించుకోలేదు. కాలువ లోకి మళ్లుతున్న కాఫీ వ్యర్థాలు నీటితో కలిసి భూమిలోకి ఇంకి పోవటంతో భూగర్భ జలాలు కలుషిత మౌతున్నాయి. సమీప గ్రామాల్లో తాగునీరు కూడా కాఫీ పొడి వాసన వస్తోంది.



కుళాయిల నుంచి వస్తున్న కాఫీరంగు నీరు (ఫైల్ ఫోటో)

### కలుషిత నీటికి కొలకలూరే ఉదాహరణ

గ్రామాల్లో భూగర్భ జలాలను మోటర్ల ద్వారా వాటర్ ట్యాంకులకు నింపి, పైప్‌లైన్ ద్వారా ఇంటింటికి తాగునీరు అందిస్తుంటారు. వాటర్ ట్యాకులోకి ఎక్కించే నీటిలో కూడా కాఫాపొడి వ్యర్థాలు చేరి ట్యాంకు అడుగున నిల్వ ఉండి తాగునీటని కలుషితం చేస్తున్నాయి. దీనికి ఉదాహరణగా రూరల్ గ్రామం కొలకలూరునే చెప్పొచ్చు. ఇప్పటికీ పైప్‌లైన్ ద్వారా అందించే తాగునీరు కాఫీ పొడి వాసన వస్తుందంటే అతిశయోక్తి కాదు. అన్నింటినీ మించి నీరు కలుషితమై 2022 జూన్ 30న డయేరియాతో బాలిక గొరికపూడి శ్రీనిధి(14) మృతి చెందగా, దాదాపు 200 మంది ఎస్సీ కాలనీ వాసులు అస్వస్థతకు గురయ్యారు. ఆ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాలరెడ్డితో పాటు, ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజని, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు గ్రామానికి పరామర్శలు, విచారణ పేరిట క్యూకట్టారు. ఆ సమయంలో గ్రామస్తులు కాంటినెంటర్ కాఫీ వర్క్స్ వ్యర్థాలే తాగునీరు కలుషితానాకి కారణంగా మొత్తుకున్నారు. అయినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. ఇక్కడి ఎస్సీ కాలనీలో జల్‌జీవన్ మిషన్ పేరిట తాగునీటి పైప్‌లైన్ మార్చటం, కొత్త ట్యాంక్ నిర్మాణం ద్వారా తాగునీటిని అందించేందుకు చర్యలు కొన సాగుతున్నా యిగాని, కాంటినెంటల్ వ్యర్థాలను అరి కట్టేందుకు మాత్రం ఎలాంటి చర్యలు లేవు. ఇప్పటికైనా అధి కార గణం స్పందించి కాఫీ ఫ్యాక్టరీ వ్యర్థాలను అరి కట్టేందుకు చర్యలు తీసుకోవాలని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# పింఛన్ల కోసం పడిగాపులు

## వడదెబ్బకు సొమ్మసిల్లిన వృద్ధులు - సచివాలయాల వద్ద రద్దీలో పండుటాకుల పాట్లు



### డబ్బుల్లేవు... రేపు రండి..

ప్రజాశక్తి మంగళగిరి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల పంపిణీ చేస్తున్న సామాజిక పెన్షన్లు పంపిణీ ఆలస్యంగా జరుగుతుంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాలంటీర్లను పాల్గొనవద్దని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేయడానికి రంగం సిద్ధం చేశారు. బుధవారం ఉదయం నుండి పంపిణీ చేస్తారని ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. మంగళగిరి పట్టణంలోని ఎనిమిదవ సచివాలయానికి పెన్షన్దారులు వెళ్లారు. డబ్బులు లేవు.. రేపు ఉదయం 6 గంటలకు రమ్మని సచివాలయ అడ్మిన్ సమాధానం చెప్పడం జరిగింది. దీంతో వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తూ వెనక్కి పోతున్నారు. టీవీలో, పేపర్లో బుధవారం నుండి పంపిణీ చేస్తామని ఎందుకు చెప్పుకొచ్చారని ప్రశ్నించారు. పెన్షన్ దారులకు సచివాలయ సిబ్బంది సమాధానం చెప్పలేకపోయారు.

### ఎట్టకేలకు సాయంత్రం ప్రారంభమైన పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి

ఎట్టకేలకు సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ బుధవారం మద్యాహ్నం ప్రారంభమైంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో పింఛన్ల పంపిణీలో వార్డు, గ్రామ వాలంటీర్లు పాల్గొనటంపై వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు పిర్యాదు చేశాయి. దీంతో వాలంటీర్లను మినహాయించి సచివాలయ సిబ్బంది ద్వారా పించన్లు పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఆ ఆదేశాల ప్రకారం బుధవారం ఉదయం నుంచి ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ ఉదయం 11 గంటల నుంచి ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు సచివాలయాలకు ఉదయం నుంచే క్యూ కట్టారు. అయితే పించన్ సొమ్ము నిర్ణీత సమయానికి పంపిణీ బృందానికి అందకపోవటంతో లబ్దిదారులు సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. మద్యాహ్నం వరకూ ఎదురు చూసిన లబ్దిదారులు బుధవారం పంపిణీ చేస్తారా, గురువారానికి వాయిదా పడుతుందా అన్న సందేహాలను వ్యక్తం చేశారు. ఎట్టకేలకు మద్యాహ్నానికి పించన్ల సొమ్ము ప్రభుత్వం నుంచి విడుదల కావటంతో ఒక అర్ధగంట అటు ఇటుగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో మూడు గంటల తరువాత పించన్ల పంపిణీ ప్రారంభమైంది. దీంతో లబ్దిదారులు ఊరట పొందారు.



పట్టణంలోని ఒకటో వార్డు సచివాలయంలో పింఛన్ల పంపిణీ



### వడదెబ్బకు సొమ్మసిల్లిన వృద్ధులు

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

పట్టణంలోని సచివాలయాల వద్ద పెన్షన్ కోసం వెళ్లిన వృద్ధులు పడిగాపులు కాశారు. సచివాలయ వద్దకు పింఛన్ కోసం వెళ్ళిన కొంతమంది వృద్ధులు సొమ్మసిల్లి పోయారు. బుధవారం నుండి పింఛన్లు సచివాలయాల వద్ద పంపిణీ చేస్తారని మున్సిపల్ అధికారులు ప్రకటించారు. అయితే బ్యాంకుల్లో నగదు డ్రాచేయడం జాప్యం జరగడంతో సాయంత్రం నాలుగు గంటల నుండి పింఛన్లు పంపిణీ ప్రారంభించారు. ఉదయం వచ్చిన పింఛన్దారులు మండు టెండలో తిండి తిప్పలు లేక అల్లాడిపోయారు. కొంతమంది




సోమసుందరపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద వేచి ఉన్న వృద్ధులు

పింఛన్‌దారులకు పైకము అందకపోవడంతో గురువారం పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో చేసేది లేక వృద్ధులు వెను తిరిగి వెళ్లారు. కనీసం మున్సిపల్ సిబ్బంది తాగునీరు, మజ్జిగ, అల్పాహారం కల్పించక పోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

### ఆలస్యంగా ప్రారంభం

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని వివిధ గ్రామాలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం సాయంత్రం ఆలస్యంగా ప్రారంభమైంది. ఉదయం నుండి సర్వర్ లు పనిచేయక, బ్యాంకు వద్ద నుండి నగదు తీసుకొని అధికారులు పంపిణీ చేసేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామాలలోని ప్రతి సచివాలయ%శీ% వద్ద టెంట్లు, పింఛన్దారులు కూర్చోవడానికి కుర్చీలను, సచివాలయ అధికారులు ఏర్పాటు చేశారు. అయితే ఉదయం నుండి తాడేపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో పింఛన్దారులైన వద్ధులు, వితంతు మహిళలు, వికలాంగులు తమకు రావాల్సిన పింఛన్ల కోసం గ్రామ సచివాలయాల వద్ద అధికారులు ఏర్పాటు చేసిన టెంట్లలో కూర్చుని, ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాయంత్రం నాలుగు గంటల నుండి సర్వర్లు పనిచేయడంతో తమ ఇళ్ల వద్ద నుండి చీకటిలోనే గ్రామ సచివాలయాల వద్దకు పింఛన్ దారులు వెళ్లి, తమకు అందాల్సిన పింఛన్లు అందుకున్నారు.






నర్రా శ్రీనివాసరావును సత్కరిస్తున్న అధ్యాపకులు

### లింగ వివక్షత విడనాడితేనే అభివృద్ధి

ప్రజాశక్తి-గుంటూరు

లింగ వివిక్షత విడనాడి, పురుషులతో పాటు మహిళలకు కూడా సమాన ప్రాతినిధ్యం కల్పించినప్పుడే దేశప్రగతిలో పురోగతి సాధించవచ్చని హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాస రావు అన్నారు. చౌడవరంలోని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీ రింగ్ కళాశాలలో బుధవారం కళాశాల ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఆధ్వర్యంలో 'సెక్సువల్ హెరాస్మెంట్ అఫ్ ఉమెన్ ఎట్ వర్క్ ప్లేస్ (ప్రివెన్షన్ , ప్రొహిబిషన్ , అండ్ రిడ్రెస్సల్) యాక్ట్ -2013' అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సుకు నర్రా శ్రీనివాసరావు ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను తెలియజేస్తూ, భారత రాజ్యాంగ నిర్మాణం మొదలు నేటి వరకు స్త్రీల రక్షణ కోసం తీసుకొచ్చిన వివిధ చట్టాల గూర్చి ఆయన వివరించారు. దేశ పాలనలో అగ్ర పీఠమైన ప్రధానమంత్రి, రాష్ట్రపతి వంటి పదవుల్లో తమ శక్తిని నిరూపించుకుంటూ, ఇస్రో, అంతరిక్ష పరిశోధనలతో పాటుగా వ్యోమగామిగా విజయ పథంలో దూసుకు పోతున్న తరుణంలో కూడా కొన్ని చోట్ల లింగ వివక్షత భేదాలు చూడటం, మహిళలపై దాడులు బాధాకరమని అన్నారు. ప్రతి ఒక్కరిలో విద్యా విజ్ఞానంతో పాటుగా న్యాయ వ్యవస్థ, అందులోని చట్టాలపై కూడా అవగాహన కలిగి ఉండటం అవసరమన్నారు. లింగ సమానత్వం చూపినప్పుడే సమ సమాజ నిర్మాణానికి నాంది పలుకవచ్చని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. శాంతియుత, ఆర్థిక సంపన్నమైన దేశ నిర్మాణానికి లింగ సమానత్వం ప్రధాన పునాది అని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాల కష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కష్ణప్రసాద్ పేర్కొన్నారు. సదస్సు అనంతరం నర్రా శ్రీనివాసరావును అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, కళాశాల ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ కన్వీనర్ డాక్టర్ జి. సుధావాణి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజినీ, డొక్కా తదితరులు

### త్వరలో జిల్లాలో సిఎం జగన్ పర్యటన

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

సిఎం జగన్ నిర్వహిస్తున్న బస్సు యాత్రలో భాగంగా త్వరలో జిల్లాకు రానున్నారని వైసిపి ప్రజా ప్రతినిధులు తెలిపారు. స్థానిక బృందావన గార్డన్స్ వైసిపి ప్రాంతీయ కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మంత్రి విడదల రజనీ, పార్టీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యేలు మద్దాలి గిరి, మేకతోటి సుచరిత, కిలారి రోశయ్య, పార్టీ అభ్యర్థులు నూరి ఫాతిమా బాలసాని కిరణ్ కుమార్, అంబటి మురళీకష్ణ, డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు తదితరులు బుధవారం సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్లుగా అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు అందాయని వీరంతా వైసిపిని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. పింఛన్ల పంపిణీని టిడిపి అడ్డుకుంటోందని, కేవలం వాలంటీర్ల మీద ఉన్న కక్షతో పింఛన్ల పంపిణీకి ఆటంకాలు కల్పించారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా సిఎం జగన్ నిర్వహించే బస్సు యాత్ర మేమంతా సిద్ధం పర్యటనపై వారు చర్చించారు. వచ్చే వారంలో శెలవులు అధికంగా ఉన్నందున నిర్ణీత షెడ్యూలు ప్రకారం జిల్లా పర్యటన జరిగే అవకాశం లేదని అందువల్ల త్వరలో పర్యటన ఖరారు అవుతుందని అన్నారు. సిఎం జగన్ ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో పర్యటిస్తున్నారని తెలిపారు. ఈసందర్భంగా ఎన్నికలకు మేమంతా సిద్ధం పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. సమావేశంలో వైసిపి నాయకులు కోలా భవాని తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక పింఛన్ దారులు అపోహలకు గురికావద్దు

### మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

సామాజిక పింఛన్ పంపిణీ విషయమై లబ్ధిదారులు ఎటువంటి అపోహలకు గురికావద్దని మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ బుధవారం తెలిపారు. విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ విధించిన నేపథ్యంలో వాలంటీర్లను విధులకు దూరంగా పెట్టారని అన్నారు. మార్చి 31 కావడంతో 1వ తేదీన పెన్షన్ పంపిణీ చేయటం సాధ్యం కాలేదని అన్నారు. పెన్షన్ పంపిణికి సంభధించి ప్రభుత్వం విధి విధానాలను తెలిపిందని అన్నారు. అందులో భాగంగా రెండు లేక మూడు క్లస్టర్లకు వీఆర్వో పెన్షన్ పంపిణీ చేస్తారని, సచివాలయాలకు వచ్చేవారికి ఇక్కడే ఇస్తారు రాలేనివారందరికీ వారి ఇళ్ల వద్దకు వెళ్లి సచివాలయ సిబ్బంది ఇస్తారని అన్నారు. పట్టణంలో 6,397 మంది పెన్షన్ దారులు ఉన్నారని, నెలకు 1 కోటి 92 లక్షలు పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉంటుందని, ఎవరూ ఎటువంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని అన్నారు. అందరికి సకాలంలో పెన్షన్లు పంపిణీ చేస్తామని, అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



### పెన్షనర్ల ఇక్కట్లు

సత్తెనపల్లి పట్టణంలో బుధవారం మొత్తం 15 సచివాలయాలు ఉన్నాయి. కొన్ని సచివాలయాలకు డబ్బులు రావడంతో సామాజిక పింఛన్ ఇస్తుండగా మరికొన్ని సచివాలయాలకు ఆలస్యంగా డబ్బులు అందడంతో గందరగోళం నెలకొంది. దీంతో కొన్ని సచివాలయాల వద్ద పింఛన్‌దారులు బారులు తీరారు. సచివాలయాలకు రాలేని వారు పింఛన్ కోసం మరింత ఆందోళన చెందుతున్నారు.

## డబ్బు జమ కాక ఆలస్యంగా పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి పెన్షన్ల పంపిణీ డబ్బు పూర్తిస్థాయిలో జమ కాకపోవడంతో ఆలస్యంగా పంపిణీ జరిగింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పెన్షన్ల పంపిణీ వాలంటీర్ల ద్వారా కాకుండా సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ కార్యక్రమం అధికారులు నిర్వహించారు. పిడుగురాళ్ల పట్టణంలో కోటి 70 లక్షల 80 వేల రూపాయలు జమ కావాలి కానీ కోటి 35 లక్షల 40 వేల రూపాయలు మాత్రమే జమ అయ్యాయని, దీంతో పెన్షన్ లబ్ధిదారులకు పంపిణీ ఆలస్యం అవుతుందని అధికారులు తెలిపారు. పిడుగురాళ్ల మొత్తంగా 6,800 మంది లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ చేయాలని అధికారులు తెలిపారు నేటి నుండి పూర్తి స్థాయిలో పెన్షన్ల పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు.

## మజ్జిగ ప్యాకెట్లుపంపిణీ

ప్రజాశక్తి-పెదకూరపాడు



వికలాంగుల,వృద్ధాప్య పింఛన్లు తీసుకునేందుకు గ్రామ సచివాలయాలకు వచ్చిన వారికి తెలుగు యువత ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. బుధవారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమం గ్రామ సచివాలయాల వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా వృద్ధులను ద్విచక్ర వాహనాలపై సచివాలయాల వద్దకు చేర్చారు. వారికి మజ్జిగ ప్యాకెట్లు పం పిణీ చేశారు. ఈ సేవా కార్యాక్రమాన్ని పెదకూరపాడు మం డల టిడిపి అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్ ఆధ్వర్యంలో తెలుగు యువత జి.శివ, వై.గోపి, సిహెచ్ కృష్ణ చేపట్టారు.



మున్సిపల్ పరిధిలో సింగ్‌నగర్ వద్ద 52 ఎకరాల టిడ్కో గృహ సముదాయానికి వెళ్లే దారి

## అధ్వానపు రోడ్లు .. వాహనచోదకుల ఇక్కట్లు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా మున్సిపల్, ఆర్అండ్ బి అధికారులు చలించడం లేదని ప్రమాదాలకు గురైన వారు విమర్శిస్తున్నారు. గుంతల రోడ్లు, అడ్డంగా పగిలి నోల్లెళ్ల బెడు తున్న సిమెంట్ (సిసి రోడ్లు) రోడ్లపై జరుగుతున్న ప్రమాదాల్లో సాధారణ ప్రజలు, పనులు చేసుకునే కూలీలు, ప్రయాణికుల మృతి చెందిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

ఇటీవల కాలంలో పొగాకు కూలి పనులకు వెళ్తున్న ఒక ట్రాక్టర్‌పై నుంచి జారిపడి కూలీలు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన మరువ కముందే మూడు మోటార్ సైకిళ్లు జారిపడ టంతో వాహన చోదకులకు ప్రమాదాలకు గురయ్యారు. రాత్రి సమయంలో రోడ్లపై గుంతలు కనపడక పోతుండటంతో వాటిలో ద్విచక్ర వాహనాలు పడి ప్రాణాలు పోయే పరిస్థితి. గాయాలపాలై ఆసుపత్రిపాలైన కూలీలు పనులకు వెళ్లలేని పరిస్థితి. దీంతో, వారి కుటుంబం గడవడం కష్టతరంగా మారుతుండటంతో అప్పులు చేయాల్సివస్తోంది.ఇప్పటికైనా ఆర్అండ్ బి అధికారులు స్పందించి వెంటనే రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.

### టెండర్లు పిలిస్తే ఎవరూ రాలేదు

ఆర్అండ్‌బి డిఈ రవీంద్రబాబు మాట్లాడుతూ సింగ్‌నగర్ దగ్గర నుంచి యుటి (కోటప్పకొండ వరకు) వరకు 11 కిలో మీటర్ల రోడ్లు వేయించేందుకు రూ.8 కోట్లు మంజూరయ్యాయని ఒక పర్యాయం టెండర్లు పిలిస్తే ఎవరు రాలేదని చెప్పారు. ఎన్నికలు అయి పోయిన తర్వాత మరోమారు టెండర్లు పిలుస్తామని అన్నారు. ఆయా రోడ్లపై టిప్పర్లు తిరుగుతుండటంతో రోడ్లు పాడై పోయాయని, ఈ విషయమై టిప్పర్ల నిర్వాహకులకు ఎన్నిసార్లు హెచ్చరించినా వారు ఆపడం లేదని అన్నారు.



సింగ్‌నగర్ దాటిన తర్వాత తారు పోయని ఆర్ అండ్ బి రోడ్డు

## ముస్లిం మైనార్టీ, నూర్‌బాషాలతో ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - వినుకొండ

ప్రజల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తోన్న మోసకారి ముఖ్యమంత్రి జగన్ వలలో ముస్లింలు చిక్కుకోవద్దని శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్, తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు విజ్ఞప్తి చేశారు. విభజించి పాలించాలని చూస్తోన్న వైసిపి కుయుక్తులపై అప్రమత్తత, సంయమనంతో ఉండాలని వారంతా కోరారు. వినుకొండ వై కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ముస్లిం మైనార్టీ, నూర్‌బాషాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ మాట్లాడుతూ సిఎఎ, ఎన్ఆర్‌సి, ట్రిపుల్ తలాక్, కశ్మీర్‌కు సంబంధించిన 370 ఆర్టికల్‌పై లోక్‌సభ, రాజ్యసభలో బల పరిచింది వైసిపి కాదా అని ప్రశ్నించారు.ముస్లింల ధార్మిక, ఇస్లామిక్ విషయాల్లో ఎవరైనా జోక్యం చేసుకుంటే వ్యతిరేకించి తీరుతామన్నారు. తాము అధికారంలోకి వస్తే ముస్లిం సంక్షేమం కోసం రూ.1500 కోట్ల నుంచి రూ.2 వేల కోట్ల వరకు కేటాయిస్తామన్నారు. రాష్ట్రం లోని 60 వేల ఎకరాల వక్ఫ్ భూములను పరి రక్షిస్తామని అన్నారు. జివి ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండ ప్రాంతానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఈ ఐదేళ్లలో రూ.300 కోట్ల నిధులు తీసుకొస్తే తాను ఐదేళ్లలో రూ.2,600 కోట్లు తీసుకొచ్చానని చెప్పారు. లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ నిజాయతీ, నిబద్ధతకు నిలువుటద్దంగా నిలబడిన షరీఫ్ బాటలోనే ముస్లిం సమాజం నడవాలని విజ్ఞప్తి చేశారు. సిఎఎకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఏ ఒక్క ముస్లింకు కూడా ఎలాంటి ఇబ్బంది జరగదన్నారు. ఎన్ఆర్‌సి దేశ ప్రజలందరీ ఒకేలా వర్తి స్తుందన్నారు. పేదలకు ఎన్ఆర్సీ ధ్రువపత్రాల ఇబ్బందులు తొల గించేందుకు మ్యానిఫెస్టోలో ప్రత్యేక హామీని పెడ తామన్నారు.




మాట్లాడుతున్నశాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్

ఎంపిగా మళ్లీ తాను గెలిస్తే వచ్చే ఐదేళ్లలో నర్సరావుపేట పార్లమెంటరీ నియోజవర్గంలో కనీసం 50 షాదీఖానాలకు ఎంపి లాడ్స్ నిధులు అందించేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నేత నాగశ్రీను, నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబహాన్, తదితరులు హాజరయ్యారు.

## 'ఒక్క అవకాశమిస్తే సమస్యలు పరిష్కరిస్తా'

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండలంలోని వెంకటాయపాలెంలో బుధవారం తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న సాంబశివరెడ్డి, పెదకూర పాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలో గ్రామస్తులు మాట్లాడుతూ తమ ప్రధాన సమస్య ప్రధాన రహదారి అని దీనికి సం బంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని, నీటి సమస్య కూడా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే వెంకటాయపాలెంకు రోడ్డు వేయిస్తానని,పులి చింతల ప్రాజెక్టు నుండి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా బెల్లంకొండ మండలం మొత్తం నీరు అందేలా చూస్తానని చెప్పారు. సాంబశివరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో టిడిపి,జనసేన,బిజెపి నాయకులు కలిసి పనిచేయాలని సూచించారు.

## 'బిసిల రక్షణకు కొత్త చట్టం తీసుకొస్తాం'

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్రంలో బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకువస్తా మని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక సుబ్బయ్య తోటలో టిడిపి ఆధ్వర్యంలో చిలకలూరిపేట 10వ క్లస్టర్ పరిది. లోని బుధవారం 'జయహో బిసి' కార్యక్రమం నిర్వ హించారు. ముఖ్య అతిథి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లా డుతూ టిడిపి పాలనలో బిసి ఉప ప్రణాళిక ద్వారా రూ.50 వేల కోట్లను బిసి కార్పొరేషన్లు, ఫెడరేషన్ల ద్వారా రాయితి రుణాలు అందించిన విషయాన్ని గుర్తుచేశారు.



'జయహో బిసి' లో పాల్గొన్న ప్రత్తిపాటి పుల్లారావు

ఎస్సీ,ఎస్టీ, బిసిలను వంచించిన ముఖ్యమంత్రి జగన్ ఇప్పటికే కులాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ధ్వజ మెత్తారు. ప్రభుత్వ వైఫల్యాలను కూటమిలోని పార్టీల కార్యకర్తలు ఇంటింటికీ ప్రచారం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం ప్రత్తిపాటి సమక్షంలో పలువురు టిడిపిలో చేరారు.

## 'మళ్లీ అధికారంలో కొస్తేనే ఆ వ్యవస్థలు ఉండేది'

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మళ్ళీ అధికారంలోకి వస్తేనే సచివాలయ,వాలంటీర్ వ్యవస్థలు, సంక్షేమ పథకాలు ఉంటాయని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాలంటీర్ల ద్వారా పెన్షన్లు పంపిణీ నిలుపుదల చేయడానికి టిడిపియే కారణమని, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చం నాయుడు సమీప బంధువు,చంద్రబాబు నాయుడుకి సన్నిహితుడు, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బహిరంగంగా సమావేశం ఏర్పాటు చేసి మరి చెప్పారని అన్నారు. ఆయా వ్యవస్థలను నిర్వీ ర్యం చేసేందుకు



చంద్రబాబు, టిడిపి నాయకులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. వాలంటీర్ల ద్వారా పంపిణీ చేయకుండా నిలిపివేయడానికి మాజీ సిఎస్ నిమ్మగడ్డ రమేష్ తో కలిసి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని అన్నారు. ఇప్పుడేమో సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలని కల్లబొల్లి మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. లక్షల మంది పెన్షన్ దారులకు ఎలా పంపిణీ చేయగలరని ప్రశ్నించారు. వాలంటీర్లు పంపిణీ చేయకుండా అడ్డుకోవడం వలన ఎంతో మంది వికలాంగులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నా రని అన్నారు. 'మేమంతా సిద్ధం' సభ పిడుగురాళ్లలో ఏర్పాటు చేసే అవకాశం ఉందని అందుకు సంబంధించి కార్యాచరణ జరుగుతోందని చెప్పారు. మరో వారం వ్యవధిలో ఈ కార్య క్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సుబ్బారావు, వైస్ చైర్మన్ కుమ్ముముక్కంటి,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## గురజాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా యలమందరెడ్డి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల



గురజాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పిడుగురాళ్లకు చెందిన యల మందరెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. యల మందరెడ్డి గత ఇరవై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో అనేక సేవలు అందించారు. 2019 ఎన్నికల్లో గురజాల నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. కాంగ్రెస్‌లో రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులుగా ప్రస్తుతం పని చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ ్టని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని యలమంద రెడ్డి చెప్పారు.



మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

## ఇండియా వేదిక అభ్యర్థిని గెలిపించండి

**ప్రజాశక్తి-తాడేపల్లి :** మంగళగిరి నియోజ కవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఇండియా వేదిక సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకర రావును గెలిపిం చాలని వామపక్ష పార్టీలు తెలిపాయి. బుధవారం స్థానిక సిపిఐ కార్యాల యంలో ఆ పార్టీ నాయకు లను అభ్యర్థి జొన్నా శివశంకర రావుతో పాటు సిపిఎం నాయకులు కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ నాయకులు మాట్లాడుతూ మంగళగిరి అసెంబ్లీ, గుంటూరు పార్లమెంట్‌కు పోటీ చేసే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపికి రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మద్దతు ఇవ్వడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో ఒక్క శాతం కూడా ఓట్లు లేని బిజెపికి టిడిపి, వైసిపి తరపున ఎంపిలు అనేక వినాశకరమైన బిల్లులకు మద్దతు ఇస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, గ్యాస్, పెట్రల్, డీజిల్ ధరలు ఆకాశం వైపు చూస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను నిత్యం అంటిపెట్టుకుని ఉండే ఇండియా వేదిక అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టె కరుణాకరరావు, వేముల దుర్గారావు, సోలా ముత్యాలరావు, ప్రసాద్, నాగేశ్వరరావు, సిపిఐ నాయకులు తుదిమెల్ల వెంకటయ్య, మానికొండ డాంగే, ఎం.రామారావు, జి.సాంబిరెడ్డి, జి.శివ, ఎస్‌కె బాష, సురేష్, వి.కోటేశ్వరరావు, ఖాశీం, అనిల్, ప్రశాంతరాజ్, కె.శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్, ప్రసన్న పాల్గొన్నారు. కెఎల్ రావు కాలనీలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి పాల్గొని మాట్లాడారు. ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారానే ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంపాటి సామ్యేలు, కె.మేరి తదితరులు పాల్గొన్నారు. సీతానగరంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో వెంపాటి సామ్యేలు మాట్లాడారు.

## వైసిపి, బిజెపి కూటమిని ఓడించండి : సిపిఎం

**ప్రజాశక్తి-తెనాలిరూరల్**



మాట్లాడుతున్న బాబు ప్రసాద్

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి, బిజెపి కూటమిలను ఓడించాలని సిపిఎం తెనాలి డివిజన్ కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్ తెలిపారు. బుధవారం తెనాలి సిపిఎం కార్యాలయంలో జనరల్‌బాడి సమావే శంలో ఆయన ప్రసంగించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్థానంలో అధ్యక్ష తరహా పాలన తేడానికి బిజెపి ప్రయత్నిస్తోందని అన్నారు. దేశంలో పలు కార్పోరేట్ కంపెనీలుతో బిజిపి సంబంధం ఏర్పరుచుకోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకానికి పెట్టిందని మన దేశ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం రంగం కీలక పాత్ర పోషించడం మనకు తెలిసిన విషయం అన్నారు. రైల్వేలను, జాతీయ రహదారులను, ఓడ రేవు లను, విమానాశ్రయాలను, విద్యుత్, గ్యాసు నిక్షే పాలను, లిగ్నైట్, బొగ్గు, ఐరన్ ఓర్ గనులను, రాగి అల్యూమినిం, జింక్ సల్ఫేట్, సాండ్ చిప్స్, గ్రావెల్ లను కార్పొరేట్ ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇచ్చారని పేర్కొన్నారు. బ్యాంకులు, ఎల్ఐసి పోస్టల్, బిఎస్ఎన్ఎల్, డిఫెన్స్, శాటిలైట్ రంగాలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతున్నారన్నారు. విశ్వ విద్యాలయాలు, ఆసుపత్రులను ప్రైవేటు రంగానికి బదలాయిస్తున్నారన్నారు. వ్యవసాయ రంగం కుదేలయ్యింది. రైతుల భూములు కార్పో రేట్ల చేతుల్లోకి దారదత్తం చేయటానికి నల్ల చట్టాలు తెచ్చారన్నారు. కార్మికులకు ఎటువంటి హక్కులు లేకుండా చట్టాలు తెచ్చారని, వారిని కట్టు బానిసలుగా చేశారన్నారు. రాజ్యాంగ వ్యవస్థలు స్వతంగా పనిచేసే పరిస్థితి లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో కొత్తరకం అవినీతికి కేంద్రం తెరలేపారని, ఎన్నికయిన పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు మంత్రులు పార్టీలు ఫిరాయించే పరిస్థితి దాపురించిందన్నారు. ఈ వర్తమాన రాజకీయ పరిస్థతులపై సిపిఎం, సిపిఐ కాంగ్రెస్ ఇతర పార్టీలతో కలిసి ఇండియా బ్లాక్ ఏర్పడినట్లు తెలిపారు. బిజెపి అలాగే బిజెపి తో పొత్తు పెట్టుకున్న పార్టీలను ఓడించటమే పార్టీ ప్రధాన కర్తవ్యమని అన్నారు. ములక శివసాంబి రెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో షేక్ హుస్సేన్ వలి వక్తలను ఆహ్వానించారు. పి జోనేశ్ వందన సమర్పణ చేశారు.



## రేపు టిడిపిలో చేరనున్న తాడిశెట్టి సోదరులు

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

టిడిపి గుంటూరు లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పత్తిపాడు అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, బుధవారం మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీతో సమావేశం అయ్యారు. టిడిపిలోకి రావాలని తాడిశెట్టి వెంకట్రావు, మురళీని వారు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో పెమ్మసాని మాట్లాడుతూ గుంటూరుకు తాడిశెట్టి సోదరులు చేసిన సేవలను టిడిపి గుర్తిస్తుందన్నారు. వైసిపి అధిష్టానం వారిని మోసం చేసిందని, వారిని టిడిపిలోకి ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడగానే వారి స్థాయికి తగ్గట్టు సముచిత స్థానం కల్పించేలాచేస్తామని హామీ ఇచ్చారు. రామాంజ నేయులు మాట్లాడుతూ తాడిశెట్టి సోదరులకు తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. తాడిశెట్టి మురళి గారు మాట్లా డుతూ గత ఎన్నికల్లో వైసిపి విజయం కోసం కృషి చేసినా తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ఈనెల 5న టిడిపిలో చేరుతున్నట్టు తెలిపారు. పార్టీ విజయం కోసం కృషి చేస్తానని తెలిపారు. బిజెపి జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు నిరంతర నిఘా ఉంచాలి

### ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగం

**ప్రజాశక్తి-గుంటూరు**



సమావేశంలో మాట్లాడుతున్న నీనా నిగం

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతవారణంలో నిర్వహించేందుకు ఓటర్లను ప్రలోబపరిచే నగదు, మద్యం, ఉచిత బహుమతుల పంపిణీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు నిరతరం నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించి, అరికట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయపరిశీలకులు నీనా నిగం సూచించారు.బుధవారం కలెక్టరేట్‌లో నీనా నిగం, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్ డూడితో కలిసి రిటర్నింగ్ అధికారులు, ఎన్ఫోర్స్మెంట్ ఎజెన్సీల నోడల్ అధికారులు, నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు, అక్కౌంటింగ్ బందాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీనా నిగం మాట్లాడుతూ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంలోని అసెంబ్లీ నియోజకవర్గాలు నగదు, మద్యంకు సెన్సిటివ్ అని, అక్రమంగా మద్యం, నగదు తరలింపు జరగకుండా అడ్డుకోవటంతో పాటు అభ్యర్థులు నిర్దేశించిన వ్యయపరిమితి మించకుండా నిరంతరం పరిశీలన చేయాలన్నారు. చెక్ పోస్టులలో వాహనాల తనిఖీ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. బ్యాంకులలో అనుమానస్పద లావాదేవీలపై అదాయపపన్ను శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఎన్నికలకు నియమించిన స్టాటికల్ తనిఖీ బృందాలతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలైన ఎక్సైజ్, సెబ్, సెంట్రల్, స్టేట్ జీఎస్టీ, ఆదాయపపన్ను శాఖ అధికారులు ప్రత్యేక బందాలు ఏర్పాటు చేసుకొని ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా ఉన్న నగదు లావాదేవీలు, మద్యం, ఉచిత బహుమతులను సీజ్ చేయాలన్నారు. సీజ్ చేసిన నగదు, వస్తువుల గురించి పిర్యాదుల రిడ్రసెల్ కమిటీకి చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు ఇబ్బందిపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.సమావేశం అనంతరం నీనా నిగంకు జిల్లా కలెక్టర్ కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూంలోని ఎంసీసీ, సీవిజిల్, ఈఎస్ఎంఎస్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బందాల రియల్ టైం మూమెంట్, ఈటీబీఎస్, సక్షమ్, ఎన్కోర్, సువిధా మానిటరింగ్ విభాగాల పనితీరును వివరించారు. సమావేశంలో నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపిలో చేరిన మూడు రాజధానుల శిబిరం నిర్వాహకులు

**ప్రజాశక్తి - తుళ్లూరు**

అమరావతిలో మూడు రాజధానుల శిబిరం నిర్వాహకులు, వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. బహుజన పరిరక్షణ సమితి అధ్యక్షులు మాదిగాని గుర్నాథం మరికొందరు బుధవారం కేశినేని చిన్ని ఆధ్వర్యంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను కలిసి టిడిపిలో చేరారు. గుర్నాథం నాలుగేళ్లుగా మందడం సీడ్ యాక్సెస్ రోడ్డు వద్ద నిర్వహిస్తున్న మూడు రాజధానుల శిబిరంలో ముఖ్య భూమిక పోషిస్తున్నారు. మూడు రాజధానులు, వికేంద్రీకరణ వల్ల లాభం జరుగుతుందని నమ్మి మోసపోయామని టిడిపిలో చేరిన అనంతరం గురునాథం అన్నారు. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తూ వైసిపి ప్రభుత్వం గత నాలుగేళ్లుగా తమను నమ్మించే యత్నం చేసిందని విమర్శించారు. అభివృద్ధి, వికేంద్రీకరణ కూటమితోనే సాధ్యమని ఆలస్యంగా గ్రహించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బహుజనుల్ని ఏకం చేసి టిడిపి, జనసేన, బిజెపి కూటమి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.వైసిపి ఎన్టీఆర్ జిల్లా వైద్య విభాగం సెల్ మాజీ అధ్యక్షులు సంకే విశ్వనాథ్,యునైటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు అప్పికట్ల జవహర్ తదితరులు గుర్నాధంతో పాటు టిడిపిలో చేరారు.

## బాబూజగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలి

**ప్రజాశక్తి మంగళగిరి**

భారత జాతికి ఎన్నో సేవలందించి, భారత ఉప ప్రధాని, వ్యవసాయ శాఖ లాంటి పదవులు చేపట్టి, ప్రత్యేకించి దళితుల హక్కుల కోసం పోరాడిన స్వాతంత్ర సమరయోధులు డాక్టర్ బాబు జగగ్జీవన్‌రామ్‌కు భారతరత్న బిరుదును ఇవ్వాలని బహుజన నాయకులు ఈపూరి ఆదాము కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆదాము మాట్లాడు తూ ఏప్రిల్ 5వ తేదీన బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించాలని విజ్ఞప్తి చేశారు. బహుజన నాయకులు శావల థామస్ కుమార్ మాట్లాడుతూ పార్టీలకు, కులమతాలకు అతీతంగా ఐదవ తేదీన జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి నివాళులర్పించే కార్యక్రమంలో పాల్గొని విజయ వంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా బాబు జగ్జీవన్ రామ్ కు భారతరత్న బిరుదును కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని దీనికి సంబంధించి అఖిల అఖిలపక్ష పార్టీ నాయకులు బహు జనులతో కలిసి ఒక కమిటీగా ప్రణాలిక రూపొందించేకు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు. మీడియా సమా వేశంలో బహుజన నాయకులు జాలాది నాగేశ్వరరావు, కుంచాల కిషోర్, వడ్డేశ్వరపు రజనీకాంత్, మీనిగ ఆంజ నేయులు పులివర్తి రాంబాబు, సాలి ప్రశాంత్, చిలకా విక్టరీ ఇమాన్యుయల్, బండపల్లి బాపయ్య పాల్గొన్నారు.




## లైబ్రరీలో పాఠకుల సంఖ్య పెరిగేలా చూడాలి

**ప్రజాశక్తి-తెనాలిరూరల్**

రూరల్ గ్రామం సంగం జాగర్లమూడి శాఖా గ్రంధాల యాన్ని గ్రంధాలయ సంస్థ జిల్లా కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ బుధవారం తనిఖీ చేశారు. పాఠకులతో మాట్లాడారు. గ్రంధాలయంలో ఉన్న సౌకర్యాలను తెలుసుకున్నారు. గ్రంధాలయం నూతన భవన నిర్మాణం ఆవశ్యకత ఉందని గ్రంధాలయాధికారి జె.వెంకటేశ్వరరావు ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ పాఠకుల సంఖ్య, సభ్యత్వం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రంధాలయ భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేయాల్సిందిగా జిల్లా కార్యదర్శి ఆదేశించినట్లు గ్రంధాలయాధికారి తెలిపారు.



నాగమల్లేశ్వరరావును సత్కరిస్తున్న అధికారులు, కాంట్రాక్టర్లు

## పదోన్నతి పొందిన నాగమల్లేశ్వరరావుకు అభినందన

**ప్రజాశక్తి-తెనాలి**

పురపాలక సంఘంలో మున్సిపల్ ఇంజనీర్‌గా పనిచేసి సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందిన కొడాలి నాగమల్లేశ్వరరావు అభినందన, వీడ్కోలు సభ మంగళవారం రాత్రి స్థానిక చెంచుపేట రావి టవర్స్‌లో నిర్వహించారు. వారం రోజుల క్రితం సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పదోన్నతి పొంది, తెనాలి నుంచి మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పురపాలక సంఘ పరిధిలోని పలువురు కాంట్రాక్టర్లు, అధికారలు సత్కరించారు. కార్యక్రమంలో గంటా సాంబశివరావు, రమేష్‌బాబు, ఎం.సురేష్, ఎం.రవికుమార్, పేరం సంజీవరెడ్డి, మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బృందం ఎంహెచ్‌వో డాక్టర్ కె.హెలెన్‌నిర్మల, శానిటరి ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, జెటివో ప్రసాద్, ఇంజనీరింగ్ సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## నేడే ఉచిత దంత వైద్యశిబిరం

**ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్**

స్థానిక వెల్లంకి బ్రదర్స్ సహకారంతో అశోక పాఠశాల ఆవరణలో గురువారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు గుంటూరు సిబార్ దంత వైద్యశాల డాక్టర్లచే ప్రత్యేక ఉచిత దంత వ్కైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లంకి బుచ్చయ్యచౌదరి తెలిపారు. పూర్తి వివరాలకు. 94931 48695, 80085 20570 నెంబర్లో సంప్రదించాలన్నారు. ప్రత్తిపాడు, కాకుమాను, పెదనందిపాడు, పర్చూరు మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలన్నారు.



## నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

**ప్రజాశక్తి మంగళగిరి**

నాదెండ్ల బ్రహ్మయ్యను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ దళిత బహుజనుల, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరి పట్టణంలోని తిప్పర్ల బజార్లో గల బ్రహ్మయ్య నివాసం వద్ద నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్,మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ మాట్లా డుతూ బ్రహ్మయ్య హత్య జరిగి నెల రోజులు కావస్తున్నప్పటికీ పోలీసులు ఇంతవరకు నిందితులను అరెస్ట్ చేయలేదన్నారు. జన చైతన్య వేదిక నాయకులు లక్ష్మారెడ్డి, సిపిఎం నాయకులు ఎం రవి, ఎస్ ఎస్ చంగయ్య, దళిత బహుజన ఫ్రంట్ నాయకులు కే వినయ్ కుమార్, ఎస్ సురేష్, వై కోటేశ్వరరావు, కే బసవరాజు, ఏ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు బకాయి జీతాలు చెల్లింపు

### ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

'అప్పుల జీవితం.. దిన దిన గండం' మున్సిపల్ కార్మికుల పై ప్రజాశక్తి లో బుధవారం వచ్చిన కథనానికి కమిషనర్ సి.హెచ్.గోవిందరావు స్పందించారు. మున్సిపల్ కార్మికులకు, ఔట్సోర్సింగ్ కార్మికులకు రావాల్సిన మూడు నెలల జీతాల బకాయిలు షుమారుగా రూ.కోటి 60లక్షలను వెంటనే టోకెన్ ఎమౌంట్‌గా ఎవరికి ఎంత రావాలో వారి బ్యాంకు ఖాతాలకు జమయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పూర్తి స్థాయిలో రెండు రోజుల్లో జమ చేస్తామని కమిషనర్ తెలిపారు. మున్సిపల్ కా ర్మికులు 250 మందికి, మరియ ఔ ట్సోర్సింగ్ లో పనిచేస్తున్న వారికి కలిపి మొత్తము అమౌంటు పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. అందుకు గాను పారిశుధ్య కార్మికులతో పాటు గా, కాంట్రాక్ట్ వర్కర్ల అందరూ కమిషనర్ సిహెచ్ గోవిందరావుకు ధన్యవాదాలు తెలిపారు.




గెలుపొందిన క్రీడాకారులను అభినందిస్తున్న సోహెల్, కుల్దీప్ తదితరులు

## ఉషూ జాతీయ స్థాయి పోటీల్లో ఏపీకి పతకాలు

ప్రజాశక్తి-గుంటూరు

జమ్మూలోని జమ్మూ యూనివర్సిటీలో గత నెల 26 నుండి 31వ తేదీ వరకూ నిర్వహించిన 23వ ఉషూ సబ్ జూనియర్ నేషనల్స్‌లో ఆంధ్రప్రదేశ్ రెండు పతకాలు కైవసం చేసుకుంది. శ్రీకాకుళంకు చెందిన రూపనరేంద్రనాయుడు ఫ్లెక్సిబుల్ వెపన్‌కట్ విభాగంలో బంగారు పతకం, రూపతన్మయి ట్రెడిషనల్ వెపన్ విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఉషూ సిఇఒ సోహెల్, ఇండియన్ చీఫ్ కోచ్ కుల్దీప్ హండో చేతులమీదుగా వారు పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఉషూ అసోసియేషన్ ఎపి సెక్రెటరీ బి.నరసింహారావు మాట్లాడుతూ ఆంధ్రాకు జాతీయ స్థాయిలో రెండు పతకాలు రావటం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరెన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తేవాలన్నారు. ఆయా విద్యార్థులను టీం కోచ్ యం.కిరణ్‌కుమార్, మోహన్, సాయి, అరుణ తదితరులు అభినందనలు తెలిపారు.




మాట్లాడుతున్న రాయపాటి శ్రీనివాస్

## జెకెసి కాలేజీలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజిలో బుధవారం కంప్యూటర్ సైన్స్ అండ్ ఎనర్జింగ్ టెక్నాలజిపై జాతీయ సదస్సు నిర్వహించారు. వివిధ కళాశాలల నుండి సదస్సుకు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు వారి అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.గంగాధరరావు ముఖ్య అతిథిగా హాజరై కంప్యూటర్ సైన్స్ ఉపయోగాలు, దీనిలో అడ్వాన్స్ టెక్నాలజీ గురించి వివరించారు. సదస్సులో కళాశాల సెక్రెటరీ జె.మురళి మోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కె.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పి.గోపిచంద్, కన్వీనర్ డాక్టర్ వై.సురేష్‌బాబు, కోఆర్డినేటర్ వై.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## టిజెపిఎస్ కాలేజీలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు




మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్

స్థానిక టి.జె.పి.యస్. కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఆదేశాల మేరకు బుధవారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మేజర్ ఏ.బి.పి. మనోహర్ మాట్లాడుతు భారత రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొని సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని కోరారు. సమర్థులు ఆలోచన చేయకపోతే అసమర్థులు రాజ్యమేలతారని, కాబట్టి యువత అలోచించి మంచి నాయకుని కోసం తప్పకుండా మీ ఓటు హక్కుని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.రాజనీతి శాస్త్ర అధ్యాపకులు మేజర్ పి.కుమార్‌రాజా మాట్లాడుతూ దేశాభివదిలో యువత ఓటు చాలా ప్రభావితం చేస్తుందని, మీరు ఓటు వేయడమే కాకుండా మీ చుట్టూ వున్నవారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్. జె.వి.సుధీర్ కుమార్, ప్రోగ్రాం అధికారులు ఆర్.జయశైలజ, లక్ష్మిదీప్తి, చంద్రశేఖర్, వేణు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

# బాధ్యతగా విధులు నిర్వర్తిస్తేనే జీరో రీపోల్ లక్ష్యం సాధ్యం

### ఎలక్షన్ పిఒలు, ఎపిఒలకు శిక్షణలో జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి




ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ రోజు నిర్వహించాల్సిన విధులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగేలా శిక్షణ అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లు, సెక్టోరల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాల్లోని పీఓ, ఏపీఓ, ఇతర సిబ్బంది దాదాపు 13000 మంది ఉద్యోగులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై పూర్తి అవగాహనతో బాధ్యతగా విధులు నిర్వహిస్తేనే ఎన్నికల సంఘం నిర్దేశించిన జీరో రీపోల్ లక్ష్యం సాధ్యం అవుతుందన్నారు. అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు పీఓ, ఏపీఓలకు చేయాల్సిన పనులు, చేయకూడని పనులపై విస్తృత స్థాయిలో అవగాహన కలిగేలా శిక్షణ అందించాలన్నారు. పోలింగ్ రోజు స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ ఫారాలు పూర్తి చేయటం, ఈవీఎంల కమిషనింగ్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్ హ్యాండ్లింగ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో తీసుకోవాల్సిన సామగ్రి, పోలింగ్ రోజు తొలుత నిర్వహించాల్సిన మాక్ పోలింగ్, యాక్టివల్ పోలింగ్, స్పెషల్ సర్కమ్స్టెన్సల్ రెస్పాన్సిబులిటీలు, పోలింగ్ క్లోజర్ ప్రక్రియ తదితర అంశా లపై పూర్తి స్థాయి అవగాహన కల్పించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియ సజావుగా, సక్రమంగా కొనసాగేలా పోలింగ్ అధికారులకు బాధ్యతగా శిక్షణ అందించాలన్నారు. శిక్షణ కార్యక్రమాలను రిటర్నింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసంమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ పీఓలు, ఏపీఓ లు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో, పోలింగ్ కేంద్రాలలో, రిస్పన్షన్ సెంటర్లలో నిర్వర్తించాల్సిన విధులను వివరించారు.ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి హరిహరనాథ్ అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఇవ్వాల్సిన అంశాలపై, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీరు శ్యాంసుందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు సర్వీస్ ఓటర్లుకు ఈటీపీబీఎస్ ద్వారా పోస్టల్ బ్యాలెట్ జనరేషన్, ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగులకు, అత్యవసర సర్వీసుల ఉద్యోగులకు ఫెసిలిటేషన్ సెంటర్ల ద్వారా, పీడబ్ల్యుడీ, 85 సంవత్సరాలు వయస్సు ఓటర్లుకు హెూమ్ ఓటింగ్ ద్వారా పోస్టల్ బ్యాలెట్‌తో ఓటింగ్ చేయించే విధానంపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తీ చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, డిఆర్ఒ పెద్ది రోజా, రిటర్నింగ్ అధికారులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, జిఎంసి అదనపు కమిషనర్ రాజ్య లక్ష్మీ, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

## ఆధునీకరించిన రెవెన్యూ భవన్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని రెవెన్యూ భవన్ ఆధునికీకరణ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఇటీవల రూ.10 లక్షలతో రెవెన్యూ భవన్‌లో ఆధునీకరించిన నాలుగు అంతస్తులను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు ఏపీఆర్ఎస్ఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్, జిల్లా సెక్రటరీ వెంకటరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అసోసియేషన్ నాయకులు బొప్పరాజు, కిరణ్ కుమార్ ద్వారా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ఉద్యోగులకు ఏ చిన్న కష్టమొచ్చినా అండగా నిలుస్తానని చెప్పారు. ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఉద్యోగుల సంక్షేమం పట్ల సానుకూల స్వభావంతో ఉన్నారని, ఉద్యోగుల గ్రీవెన్స్‌కు ఆద్యుడని కొనియాడారు. ఉద్యోగుల ఆరోగ్యంపై శ్రద్ధతో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయించారన్నారు. రెవెన్యూ క్రీడలను ముందుండి నడిపించారన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రమేష్‌కుమార్, డిఆర్ఒ పెద్దిరోజా, ఏపీజేఏసీ సెక్రెటరీ జనరల్ పలిశెట్టి దామోదర్‌రావు, పూర్వ డీఆర్వో చంద్రశేఖర్, ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ కనపర్తి సంగీతరావు, ఇతర నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

## చలపతి ఇంజనీరింగ్ కాలేజీలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి రక్తదానం మిన్న అని, ఒకరు రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న ఇద్దరి ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ రక్తదాతలుగా మారి, ప్రాణదాతలు కావాలని సూచించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థులను కళాశాల చైర్మన్ వై.వి.ఆంజనేయులు, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ అభినందించారు. ఈ శిబిరంలో సుమారు వంద మంది విద్యార్థులు రక్తదానం చేసినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆర్.శ్రీనివాసులు తెలిపారు.




రక్తదానం చేసిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు




విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కమిషనర్ నాగరాణి

## పాలీసెట్ శిక్షణా శిబిరాన్ని సందర్శించిన కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక నల్లపాడులోని యంబిటిఎస్ పాలిటెక్నిక్ కాలేజిలో జరుగుతున్న పాలీసెట్-2024 ఉచిత శిక్షణా శిబిరాన్ని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి, సెక్రెటరీ కె.రమణబాబు, సంయుక్త కార్యదర్శి జానకిరామ్, ఉపకార్యదర్శి రవికుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఉచిత శిక్షణకు హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కమిషనర్ నాగరాణి పాలిటెక్నిక్ కోర్సుల ప్రాధాన్యత, ఉపాధి అవకాశాల గురించి వివరించారు. అనంతరం ఉచిత స్టడీ మెటీరియల్‌ను కమిషనర్ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానా చార్యులు టి.శేఖర్, సుమారుగా 150 మంది విద్యార్థులు, వారి తల్లి తండ్రులు పాల్గొన్నారు.

## మణిపాల్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు

ప్రజాశక్తి-తాడేపల్లి




మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్ కంటెపూడి తదితరులు

పెద్దలకు వ్యాక్సినేషన్ కోసం మణిపాల్ ఆసుపత్రిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ఏర్పాట చేసినట్లు డాక్టర్ సుధాకర్ కంటెపూడి అన్నారు. బుధవారం తాడేపల్లిలోని మణిపాల్ ఆసుపత్రిలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ పెద్దలకు వ్యాక్సినేషన్‌ను సులువుగా అందించడానికి ఒక కేంద్రాన్ని నిర్మించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను స్థాపించినట్లు తెలిపారు. న్యుమోకాకల్ వ్యాధి, ఇన్ఫ్లుఎంజా వంటి పెరుగుతున్న శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల కారణంగా వ్యాక్సినేషన్ అవసరాన్ని గుర్తిస్తూ వృద్ధులకు, కొమొర్బిడిటీ ఉన్న రోగులకు, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధి, గుండె జబ్బులు, మూత్రపిండ వ్యాధి, మధుమేహం, కేన్సర్ వంటి పరిస్థితులతో బాధపడుతున్న పెద్దల కోసం సమగ్ర ఆరోగ్య సంరక్షణ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వారా రోగులకు టీకాలు వేయను న్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో డాక్టర్ లోకేష్, డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ ఎన్.మురళీ కృష్ణ, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ యు హారిక తదితరులు పాల్గొన్నారు.